

“ చాలా సమస్యలు మౌనంతో పరిష్కారం అవుతాయి. కానీ, మనం మాటలతో ఆ అవకాశాన్ని చేజార్చుకుంటాం ”

- మహాత్మా గాంధీ


Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్



IRS PUBLICATIONS

irspublications12@gmail.com



సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 71 | మంగళవారం 05 ఆగస్టు 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


# స్తంభించిన పార్లమెంటు

## - ఎస్ఐఆర్‌పై చర్చకు ప్రతిపక్షం పట్టు




**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం, ఆగస్టు 04**

బీహార్‌లో ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)పై చర్చకు ప్రతిపక్షాలు పట్టుబట్టాయి. దీంతో పార్లమెంటు స్తంభించింది. లోక్‌సభ ప్రారంభం కాగానే ఎస్ఐఆర్‌పై చర్చకు డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష ఎంపిలు సభా వేదిక వద్దకు దూసుకెళ్లారు. ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. దీంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. వెంటనే సభను స్పీకరు ఓం బిర్లా మధ్యాహ్నం రెండు గంటల వరకు వాయిదా వేశారు. సభ వాయిదా



ఎస్సీ అంతర్గత రిజర్వేషన్ నివేదిక మంత్రివర్గంలో

## ప్రవేశపెట్టాలి

- ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు జస్టిస్ నాగమోహన్ దాస్ కమిషన్ నివేదిక

2లో



రాష్ట్రపతి, ప్రధాని మోదీలను కలిసిన

## అశోక్ గజపతిరాజు

- గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి ఢిల్లీకి వెళ్లిన అశోక్ గజపతిరాజు
- పార్లమెంటులో మోదీ, అమిత్ షాలతో భేటీ

2లో



## ఇవేం మాటలు?...

- రాహుల్ గాంధీపై సుప్రీంకోర్టు ఆగ్రహం
- చైనాతో సరిహద్దులో భారత సైన్యం సరిగా పోరాడలేదన్న రాహుల్
- పరువు నష్టం కేసు దాఖలు చేసిన బీజేపీ నేత
- ఈ కేసుపై స్టే ఇచ్చిన అత్యున్నత న్యాయస్థానం
- ఆచితూచి వ్యాఖ్యలు చేయాలంటూ రాహుల్ కు హితవు

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం, ఆగస్టు 04**

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భారత సైన్యం గురించి చేసిన వ్యాఖ్యలపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. “దేశభక్తి ఉన్న ఏ భారతీయుడూ

2లో

సెప్టెంబర్ 1 నుంచి

# కొత్త బార్ పాలసీ

- ఆదాయం కాదు, ఆరోగ్యమే ముఖ్యం
- ఏపీ కొత్త బార్ పాలసీపై సీఎం చంద్రబాబు
- ఆదాయం కన్నా ప్రజల ఆరోగ్యానికే ప్రాధాన్యం
- పేదల కుటుంబాలు నష్టపోకుండా చూడాలి
- గీత కార్మికులకు బార్లలో 10 శాతం రిజర్వేషన్
- లాటరీ పద్ధతి ద్వారా బార్ లైసెన్సుల కేటాయింపు
- సెప్టెంబర్ నాటికి రాష్ట్రవ్యాప్తంగా నాటుసారా నిర్మూలన లక్ష్యం



**అమరావతి- సూర్య వాస్తవం, ఆగస్టు 04**

మద్యం పాలసీ అనగానే దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వాలైనా ఆదాయం గురించి చూస్తాయని... కానీ మద్యం పాలసీ అంటే ఆదాయమే కాదని.. ప్రజల ఆరోగ్యమే ముఖ్యమనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఆల్కహాల్ కంటెంట్ తక్కువ ఉన్న మద్యం ద్వారా మద్యం వినియోగదారుల ఆరోగ్యాన్ని చాలా వరకు కాపాడవచ్చు అని సీఎం అన్నారు. మద్యం పాలసీ అంటే ఆదాయం మాత్రమే అని భావించొద్దని...ప్రజల ఆరోగ్యాలు ప్రధానమైన అంశమనే విషయాన్ని కూడా గుర్తుపెట్టుకోవాలని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో నాణ్యత లేని మద్యం కారణంగా కొన్ని లక్షల కుటుంబాలు నష్టపోయాయన్న విషయాన్ని సీఎం గుర్తుచేశారు. పేదల ఇల్లు, ఒళ్లు గుల్ల కాకుండా చూడాల్సిన అవసరం ఉందని సీఎం స్పష్టం చేశారు. సోమవారం నాడు సీఎం చంద్రబాబు సచివాలయంలో ఆబ్కారీ శాఖపై సమీక్ష చేపట్టారు. మంత్రులు కొల్లు రవీంద్ర, కొండపల్లి శ్రీనివాస్, అధికారులు ఈ సమీక్షకు హాజరయ్యారు. ప్రస్తుతం ఉన్న బార్ పాలసీ గడువు తీరడంతో.... సెప్టెంబర్ 1 నుంచి

- మిగతా 2లో..

పీపుల్, విజన్, నేచర్, టెక్నాలజీ అంశాలకు

# పాలనలో ప్రాధాన్యత

- రాష్ట్ర స్థూల ఉత్పత్తిపై సీఎం చంద్రబాబు సమీక్ష
- 2029 నాటికి తలసరి ఆదాయం రూ. 5.42 లక్షలకు పెంచాలని లక్ష్యం
- ప్రతి ప్రభుత్వ శాఖకు పనితీరును కొలిచే ఇండికేటర్లు తప్పనిసరి
- ఉత్పత్తులకు విలువ జోడించడం ద్వారానే జీఎస్డీపీ వృద్ధి సాధ్యం
- ప్రజలకు నాణ్యమైన జీవన ప్రమాణాల కల్పనే ప్రభుత్వ ధ్యేయం

**అమరావతి- సూర్య వాస్తవం, ఆగస్టు 04**



పీపుల్ (ప్రజలు), విజన్ (దార్శనికత), నేచర్ (ప్రకృతి), టెక్నాలజీ (సాంకేతి కత)... అనే నాలుగు అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ పాలన సాగిస్తేనే అత్యుత్తమ ఫలితాలు సాధించగలమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యంగా ప్రభుత్వ ప్రణాళికలు ఉండాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. సోమవారం సచివాలయంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్డీపీ), కీలక పనితీరు సూచికలపై (కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్) ప్రణాళికా శాఖ సహా పలువురు ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ, “ప్రజలనే కేంద్రంగా చేసుకొని, భవిష్యత్ విజన్‌తో స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. పర్యావరణానికి హాని కలగకుండా, టెక్నాలజీని సమర్థవంతంగా వినియోగించుకుంటూ పాలన సాగించాలి. ఈ నాలుగు సూత్రాలను సమన్వయం చేసుకుంటూ పనిచేస్తే అద్భుతమైన ఫలితాలు వస్తాయి” అని పేర్కొన్నారు.

- మిగతా 2లో..

ప్రభుత్వ విద్యలో

## టీచర్ల పాత్ర కీలకం

### - మంత్రి నారా లోకేష్



**అమరావతి - సూర్య వాస్తవం, ఆగస్టు 04**

ప్రభుత్వ విద్యలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను మోడల్ స్టేట్‌గా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ముఖ్యమని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు లోకేష్‌ను ఉండవల్లిలోని

- మిగతా 2లో..

## కుంకీ ఏనుగుల తొలి ఆపరేషన్ విజయవంతం

- పంటలను నాశనం చేస్తున్న ఏనుగులను తరిమికొట్టిన కుంకీలు
- సరిహద్దు రైతులకు ఇది పెద్ద భరోసా అన్న పవన్ కల్యాణ్
- ఆపరేషన్ విజయవంతం చేసిన అటవీ సిబ్బందికి అభినందనలు
- కుంకీలను ఇచ్చిన కర్ణాటక ప్రభుత్వానికి కృతజ్ఞతలు
- తదుపరి ఆపరేషన్ పుంగనూరులో చేపట్టేందుకు ఏర్పాట్లు




**అమరావతి - సూర్య వాస్తవం, ఆగస్టు 04**

ఆంధ్రప్రదేశ్‌లో ఏళ్ల తరబడి రైతులను వేధిస్తున్న ఏనుగుల

- మిగతా 2లో..


సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి


## పాత కేసుల్లో అరెస్టులకు ఆరాటం ఎందుకు?




### - పోలీసులను నిలదీసిన హైకోర్టు


**అమరావతి - సూర్య వాస్తవం, ఆగస్టు 04**

రెండు, మూడేళ్ల నాటి కేసులపై ఇప్పుడు ఫిర్యాదు చేస్తే హడావుడిగా ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సిన అవసరం ఏముందని పోలీసులను హైకోర్టు ప్రశ్నించింది. వైసిపి నేత తురకా కిషోర్‌పై ఇప్పుడు ఫిర్యాదులు అందుకొని అత్యవసరంగా అరెస్టు చేయాల్సిన అవసరం ఎందుకొచ్చిందని నిలదీసింది. పోలీసులు చట్ట నిబంధనలను అనుసరించకపోయినప్పటికీ మెజిస్ట్రేట్ రిమాండ్ విధించడాన్ని తప్పుపట్టింది. మెజిస్ట్రేట్ కళ్లకు గంతలు కట్టుకుని రిమాండ్ ఉత్తర్వులు

## మోడీకి చంద్రబాబు దాసోహం

### - కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి

**శ్రీకాకుళం - సూర్య వాస్తవం, ఆగస్టు 04**



టిడిపి మద్దతుపైనే ఎన్‌డిఎ ప్రభుత్వం మనుగడ సాగించాల్సిన పరిస్థితి ఉన్నా మోడీకి చంద్రబాబు దాసోహమైపోయారని కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి విమర్శించారు.

- మిగతా 2లో..

# స్తంభించిన పార్లమెంటు

(మొదటిపేజీ తరువాయి)

అనంతరం పార్లమెంటు ఆవరణలో కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ మాట్లాడుతూ, దేశంలో రాజ్యాంగబద్ధమైన ఓటు హక్కును ప్రభుత్వం ఖూనీ చేస్తోందని, స్వేచ్ఛాయుతమైన, న్యాయమైన ఎన్నికల ప్రక్రియను దెబ్బతీస్తోందని విమర్శించారు. బీహార్‌లో ఎస్ఐఆర్‌తో పెద్ద సంఖ్యలో ఓటర్లను తొలగిం చడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్‌పై పార్లమెంట్లో సమగ్రమైన, పారదర్శకమైన చర్చ జరపాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌కు ప్రభుత్వం అంగీకరించాలని కోరారు. ఎస్ఐఆర్ అణగారిన వర్గాలను తీవ్రంగా ప్రభావితం చేసిందని, త్వరలో అస్సాం, పశ్చిమ బెంగాల్ వంటి ఇతర రాష్ట్రాలకూ విస్తరించే అవకాశం ఉందని అన్నారు. తిరిగి మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమైన సభలోనూ ప్రతిపక్షాలు ఆందోళన కొనసాగించాయి. దీంతో సభను మంగళవారానికి వాయిదా వేశారు. నిమిషాల్లోనే సభ వాయిదా పడింది. మధ్యాహ్నం 2గంటలకు సభ తిరిగి సమావేశమైనపుడు సభాధ్యక్ష స్థానంలో వున్న జగదాంబికా పాల్ మాట్లాడుతూ, రెండు కీలకమైన క్రీడా బిల్లులు సోమవారం సభలో చర్చకు వున్నాయని, వాటిపై చర్చించి, ఆమోదించకపోతే, క్రీడాకారులకు న్యాయం జరగదని అన్నారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, క్రీడా మంత్రి మన్‌సుఖ్ మాండవీయ కూడా ఇదే రీతిలో అభిప్రాయాలు వ్యక్తం చేశారు. గందరగోళం కొనసాగుతుండగానే ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి కస్టమ్స్ సుంకాలపై తీర్మానాన్ని ప్రతిపాదించారు. దాన్ని మూజువాణీ ఓటుతో ఆమోదించారు.

**మాజీ సిఎం శిబూ సోరెన్‌కు పార్లమెంటు ఉభయ సభల ఘన నివాళి**

అంతకుముందు సోమవారం కన్నుమూసిన జార?ండ్ మాజీ ముఖ్యమంత్రి, జెఎంఎం వ్యవసాపకులు శిబూ సోరెన్‌కు పార్లమెంటు ఉభయ సభలు ఘనంగా నివాళులర్పించాయి. సభ్యులంతా మౌనం పాటించి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. అనంతరం రాజ్యసభ ఆయన గౌరవార్థం సభను మంగళవారానికి వాయిదా వేసింది. గిరిజన ప్రజల హక్కులు, అభివృద్ధి కోసం జరిగిన పోరాటంలో శిబూ సోరెన్‌ది ప్రముఖ స్వరమని రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ అన్నారు. దిషోం గురుగా, ప్రజల్లో గురూజీగా ముద్రను వేసుకున్న ప్రత్యేకమైన ఆదివాసీ నాయకుడని వ్యాఖ్యానించారు. లోక్‌సభ స్పీకరు ఓం బిర్లా మాట్లాడుతూ గిరిజన వర్గాల అభ్యున్నతికి, తన సొంత రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారని అన్నారు.

### ఎస్సీ అంతర్గత రిజర్వేషన్ నివేదిక

# మంత్రివర్గంలో ప్రవేశపెట్టాలి

**- ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు జస్టిస్ నాగమోహన్ దాస్ కమిషన్ నివేదిక**

**బెంగళూరు– సూర్య వాస్తవం, ఆగస్టు 04**

షెడ్యూల్డ్ కులాలకు (ఎస్సీ) అంతర్గత రిజర్వేషన్లు కల్పించడానికి ఏర్పాటైన జస్టిస్ నాగమోహన్ దాస్ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ సోమవారం తన తుది నివేదికను ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు సమర్పించింది. జస్టిస్ నాగమోహన్ దాస్ సోమవారం విధానసౌధలో సీఎం సిద్ధరామయ్యను కలిసి, అనేక మంది రాష్ట్ర మంత్రుల సమక్షంలో అంతర్గత రిజర్వేషన్లపై 1,766 పేజీల సమీక్ష నివేదికను సమర్పించారు. తరువాత, జస్టిస్ నాగమోహన్ దాస్ విలేకరులతో మాట్లాడుతూ, కమిషన్ నివేదిక షెడ్యూల్డ్ కులాలకు (ఎస్సీ) అంతర్గత రిజర్వేషన్లు కల్పించాలని సిఫార్సు చేసిందని అన్నారు. "పూర్తి డేటాను విశ్లేషించిన తర్వాత, కమిషన్ తన నివేదికను కర్ణాటక ప్రభుత్వానికి సమర్పించింది. ఇది దాదాపు 1,766 పేజీల సర్వే నివేదిక. మొబైల్ అప్లికేషన్ ద్వారా సర్వే జరిగింది. చాలా కాలంగా, షెడ్యూల్డ్ కులాలలో అంతర్గత రిజర్వేషన్లు ఉండాలని నా కోరిక. అంతర్గత రిజర్వేషన్లు కల్పించాలని నేను ప్రభుత్వానికి సిఫార్సు చేశాను" అని జస్టిస్ దాస్ ఇక్కడ మీడియాతో అన్నారు. "షెడ్యూల్డ్ కులాలకు అంతర్గత రిజర్వేషన్ల అమలును అధ్యయనం చేయడానికి ఏర్పాటు చేయబడిన రిటైర్డ్ జస్టిస్ హెచ్.ఎన్. నాగమోహన్ దాస్ నేతృత్వంలోని కమిటీ ఈరోజు తన తుది నివేదికను సమర్పించింది. "సుమారు 1766 పేజీలు మరియు 6 సిఫార్సులను కలిగి ఉన్న నివేదిక, సర్వే డేటా మరియు అనుబంధాలను ఈరోజు సమర్పించారు. సామాజిక న్యాయం అమలులో ఇది ఒక ముఖ్యమైన మైలురాయి అని నేను నమ్ముతున్నాను" అని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఎక్స్‌లో పోస్ట్ చేశారు. దీనిపై మీడియాకు స్పందించిన సీఎం సిద్ధరామయ్య, "అంతర్గత రిజర్వేషన్లపై జస్టిస్ నాగమోహన్‌దాస్ కమిషన్ నివేదిక ఇచ్చింది. అందులో ఏముందో ఇంకా చూడలేదు. ఆగస్టు 7న కేబినెట్ సమావేశం ఉంది. నివేదికను సమర్పించి దానిపై చర్చిస్తాం" అని అన్నారు. షెడ్యూల్డ్ కులాలకు అంతర్గత రిజర్వేషన్ల అమలుపై సలహా ఇచ్చేందుకు కర్ణాటక ప్రభుత్వం 2024 అక్టోబర్‌లో ఒక సభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసింది.

### రాష్ట్రపతి, ప్రధాని మోదీలను కలిసిన

# అశోక్ గజపతిరాజు

**- గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి ఢిల్లీకి వెళ్లిన అశోక్ గజపతిరాజు**

**- పార్లమెంటులో మోదీ, అమిత్ షాలతో భేటీ**

**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం, ఆగస్టు 04**

గోవా గవర్నర్‌గా అశోక్ గజపతిరాజు బాధ్యతలను స్వీకరించిన సంగతి తెలిసిందే. గవర్నర్ గా నియమితులైన తర్వాత ఆయన తొలిసారి ఢిల్లీలో పర్యటిస్తున్నారు. పర్య టనలో భాగంగా తొలుత ఆయన రాష్ట్రపతి భవన్ కు చేరుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో సమావేశమయ్యారు. అనంతరం పార్లమెంటుకు వెళ్లి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, జేపీ నడ్డా, రామ్మోహన్ నాయుడులతో వేర్వేరుగా భేటీ అయ్యారు. పార్లమెంటు వద్ద అశోక్ గజపతిరాజుకు టీడీపీ ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, కలిశెట్టి అప్పలనాయుడు స్వాగతం పలికారు.

# ఇవేం మాటలు?...

(మొదటిపేజీ తరువాయి)

ఇలాంటి వ్యాఖ్యలు చేయడు" అని కోర్టు అభిప్రాయపడింది. అయితే, ఈ వ్యాఖ్యలకు సంబంధించిన పరువు నష్టం కేసులో రాహుల్ గాంధీకి తాత్కాలిక ఊరట లభించింది. ఇటీవల ఒక కార్యక్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, "మన భారత ఆర్మీ చైనా సరిహద్దులో సరైన విధంగా పోరాడలేదు" అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ నాయకుడు ఒకరు రాహుల్ గాంధీపై పరువు నష్టం కేసు దాఖలు చేశారు. ఈ కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు రాహుల్ గాంధీ వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుపట్టింది. అయినప్పటికీ, కోర్టు ఈ కేసుపై స్టే జారీ చేసింది. రాహుల్ గాంధీ తరపున వాదించిన న్యాయవాది, ఆయన వ్యాఖ్యలను వక్రీకరించారని, సైన్యాన్ని అవమానించే ఉద్దేశం రాహుల్ గాంధీకి లేదని కోర్టులో వాదించారు. ఈ వాదనను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు, పరువు నష్టం కేసుపై స్టే ఇచ్చింది. అయితే, రాహుల్ గాంధీ వంటి బాధ్యతాయుత రాజకీయ నాయకులు ఇలాంటి వ్యాఖ్యలు చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని కోర్టు సూచించింది.

### సెప్టెంబర్ 1 నుంచి

# కొత్త బార్ పాలసీ

(మొదటిపేజీ తరువాయి)

కొత్త పాలసీ రావాల్సి ఉంది. అధికారులు సీఎంకు కొత్త పాలసీపై ప్రతిపాదనలు వివరించారు. మంత్రివర్గ ఉపసంఘం ఇచ్చిన నివేదిక, ప్రతిపాదనల ఆధారంగా కొత్త పాలసీకి రూపకల్పన చేసినట్లు సీఎం తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 840 బార్లు ఉన్నాయి. కొత్త పాలసీలో లాటరీ పద్ధతి ద్వారా బార్లకు అనుమతులు ఇస్తారు. 50 వేల లోపు జనాభా ఉంటే రూ.35 లక్షలు, 5 లక్షల లోపు జనాభా ఉంటే రూ.55 లక్షలు, 5 లక్షల పైన జనాభా ఉంటే రూ.75 లక్షల చొప్పున లైసెన్స్ ఫీజు ఏడాదికి పెట్టాలనే ప్రతిపాదన మంత్రివర్గ ఉపసంఘం నుంచి వచ్చింది. కొత్త పాలసీలో అప్లికేషన్ ఫీజ్, లైసెన్స్ ఫీజు ద్వారా రూ.700 కోట్ల ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేశారు. ప్రతి బార్ కు కనీసం 4 అప్లికేషన్లు రావాలనే నిబంధనను పెట్టనున్నారు. బార్ పాలసీలో కూడా గీత కులాలకు 10 శాతం బార్లు దక్కేలా చూడాలని సీఎం స్పష్టం చేశారు. లిక్కర్ షాపుల్లో ఎలా అయితే 10 శాతం వారికి ఇచ్చారో... అదే విధంగా బార్లలో కూడా ఆ వర్గాలకు బార్లు కేటాయించనున్నారు. పొరుగు రాష్ట్రాల పరిధిలో సరిహద్దుల్లో లిక్కర్ సేల్స్ పెరగడానికి గల కారణాలు కూడా అధికారులు సీఎంకు వివరించారు. ఏపీలో రేట్లు తగ్గడం, అన్ని బ్రాండ్లు అందుబాటులో ఉండడం, నాణ్యమైన మద్యం దొరకడంతో మన రాష్ట్రానికి చెందిన మద్యం వినియోగదారులు ఇక్కడే మద్యం కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. దీంతో మన దగ్గర సరిహద్దు ప్రాంతాల్లోని లిక్కర్ షాపుల్లో సేల్స్ పెరగగా.... పొరుగు రాష్ట్రాల్లో సేల్స్ తగ్గాయని అధికారులు తెలిపారు. గతంలో మన రాష్ట్రంలో నాణ్యమైన మద్యం లేకపోవడం, అధిక ధరలు, మంచి బ్రాండ్లు దొరక్క పోవడం వల్ల ఇక్కడి వాళ్లు పొరుగు రాష్ట్రాలకు వెళ్లి మద్యం తాగేవాళ్లని గుర్తు చేశారు. మరోవైపు దీన్ని సొమ్ము చేసుకోవడానికి అక్రమంగా ఇతర రాష్ట్రాల నుంచి మద్యం తెచ్చే వాళ్లని... ఇప్పుడు ఆ సమస్య లేకుండా పోయిందని అధికారులు చెప్పారు. అయితే ఇప్పుడు 12 జిల్లాల్లో పూర్తి స్థాయిలో ఐడీ లిక్కర్ ఫ్రీ జిల్లాలుగా ప్రకటించామని... ఈ నెలలో మరో 8 జిల్లాలను ఇల్లిసిట్లీ డిస్టిల్డ్ లిక్కర్ ( ఐడి లిక్కర్) ఫ్రీ జిల్లాలుగా ప్రకటిస్తామని చెప్పారు. సెప్టెంబర్ నాటికి మిగిలిన 6 జిల్లాలను కూడా ఐడీ లిక్కర్ ఫ్రీ జిల్లాలుగా ప్రకటిస్తామని అధికారులు సీఎంకు తెలిపారు.

### పీపుల్, విజన్, నేచర్, టెక్నాలజీ అంశాలకు

# పాలనలో ప్రాధాన్యత

(మొదటిపేజీ తరువాయి)

**ఆగస్టు 15 నుంచి 700 సేవలు ఆన్‌లైన్**

రానున్న ఆగస్టు 15వ తేదీ నుంచి 700 రకాల ప్రభుత్వ సేవలను ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకురావాలని సీఎం అధికారులను ఆదేశించారు. పాలనలో పారదర్శకత, వేగాన్ని పెంచేందుకు టెక్నాలజీని గరిష్ఠంగా వాడుకోవాలని సూచించారు. 2029 నాటికి రాష్ట్ర తలసరి ఆదాయాన్ని రూ. 5.42 లక్షలకు చేర్చాలని లక్ష్యంగా నిర్దేశించారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి ఇది రూ. 3,47,871గా ఉండాలని స్పష్టం చేశారు.

**ప్రతి శాఖకు పనితీరు ఇండికేటర్లు**

ప్రతి ప్రభుత్వ విభాగం తమ పనితీరును కొలిచేందుకు నిర్దిష్ట ఇండికేటర్లను ఏర్పాటు చేసుకోవాలని చంద్రబాబు ఆదేశించారు. నీతి ఆయోగ్ తరహాలో రాష్ట్ర ప్రణాళికా విభాగం అన్ని శాఖలను ముందుకు నడిపించాలన్నారు. "రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరిగితేనే ప్రజలకు సంక్షేమం, అభివృద్ధిని అందించగలం. వ్యవసాయం, మైనింగ్ వంటి రంగాల్లో ఉత్పత్తులకు విలువ జోడింపుపై (వాల్యూ ఎడిషన్) దృష్టి సారించాలి" అని ఆయన సూచించారు. ప్రస్తుతం ఉద్యానవన పంటల ద్వారా రూ. 1,26,098 కోట్లు, ఆక్వా ద్వారా రూ. 1.12 లక్షల కోట్ల జీవీఏ వస్తున్నట్లు అధికారులు సీఎంకు వివరించారు.

**మనకు మనమే తెలివైన వాళ్లమని అనుకుంటే ఎలా?**

"కేవలం 60 లక్షల జనాభా, పరిమితమైన వనరులతో సింగపూర్ దేశం అంతర్జాతీయంగా విజయాలు సాధిస్తోంది. భారత్ లో 140 కోట్లకు పైగా జనాభా, అపారమైన వనరులతో చాలా విజయాలు సాధించే అవకాశం ఉంది. బయటి ప్రపంచం చూడకుండా మనకు మనమే తెలివైన వాళ్లని భావించుకోవడం సరికాదు. ఆర్టీజీఎస్ ద్వారా వచ్చే సమాచారాన్ని క్రోడీకరిస్తే అది అతిపెద్ద సంపద అవుతుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఆ సమాచారాన్ని విశ్లేషించి వినియోగించుకుని ప్రభుత్వ శాఖల సామర్థ్యాన్ని పెంచుకునే అవకాశముంది. అలాగే ప్రతీ త్రైమాసికానికీ సాధిస్తున్న పురోగతిపై ప్రభుత్వ శాఖలు సమీక్షించుకోవాలి" అని సీఎం చంద్రబాబు సూచించారు.

కుటుంబాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని వారి ఆర్థిక, ఆరోగ్య వివరాలను నమోదు చేయాలని, ప్రభుత్వ పథకాలతో పాటు వారి ఆదాయం పెరిగేలా చూడాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ సమీక్షలో మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ విద్యలో

# టీచర్ల పాత్ర కీలకం

(మొదటిపేజీ తరువాయి)

ఆయన నివాసంలో సోమవారం కలిశారు. ఎంఇఒ పోస్టుల్లో జిల్లా పరిషత్ ఉపాధ్యాయులకు కూడా అవకాశం కల్పించాలని, 2003 డిఎస్‌సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని మంత్రి లోకేష్‌ను అసోసియేషన్ నాయకులు కోరారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యనూ చర్చల ద్వారా పరిష్కారం చూపుతామని, ఎవరూ ఆందోళన పడాల్సిన పనిలేదని వారితో లోకేష్ చెప్పారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఇకపై ఆయా జిల్లాల్లో జరిగే క్లస్టర్ సమావేశాలకు తప్పనిసరిగా హాజరవుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె శ్రీనివాసరావు, బి హైమారావు, మాజీ ఎమ్మెల్సీ ఎఎస్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**నో అడ్మిషన్ల బోర్డు చూసి ఆనందించా..**

ఆదోని మున్సిపల్ నెహ్రూ మెమోరియల్ హైస్కూల్‌లో నో అడ్మిషన్ల బోర్డు చూసి చాలా ఆనందించానని మంత్రి లోకేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 1,725 మంది విద్యార్థులున్న ఈ స్కూల్‌లో ఈ ఏడాది అన్ని తరగతుల్లో 400 మందికి పైగా కొత్త విద్యార్థులు చేరడం ప్రభుత్వ విద్య పట్ల ప్రజల్లో పెరుగుతున్న నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఫయాజుద్దీన్, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి పాఠశాలలో ఇలాగే నో అడ్మిషన్ బోర్డులు కనిపించాలని పేర్కొన్నారు. తల్లిదండ్రుల్లో ప్రభుత్వ విద్య పట్ల నమ్మకం కల్పించిన ఉపాధ్యాయులే ఎపి మోడల్ ఎడ్యుకేషన్‌ను తీర్చిదిద్దే రథ సారథులు అని తెలిపారు.

# పాత కేసుల్లో అరెస్టులకు ఆరాటం ఎందుకు?

(మొదటిపేజీ తరువాయి)

ఇస్తున్నారని ఘాటు వ్యాఖ్య చేసింది. ఇలాంటి వాళ్ల విషయంలో చర్యలు తీసుకోకపోవడం తమ తప్పిదమేనని అభిప్రాయపడింది. రిమాండ్ విధిస్తూ మెజిస్ట్రేట్ జారీ చేసిన ఉత్తర్వులకు చెందిన పత్రాలను పిటిషనర్ న్యాయవాది హైకోర్టుకు సమర్పించారు. ఆ పత్రాలను తమకు ఇవ్వలేదని ప్రభుత్వ సహాయ న్యాయవాది చెప్పారు. పిటిషనర్ లాయర్ ఇవ్వడానికి ప్రయత్నిస్తే.. రిజిస్ట్రీ ముందు దాఖలు చేసేలా ఆదేశించాలని ప్రభుత్వ సహాయ న్యాయవాది పదేపదే చెప్పడంపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. పత్రాలను ఎందుకు తీసుకోరని ప్రశ్నించింది. కోర్టులో ఈ విధంగా వ్యవహరించడంపై అసంతృప్తిని వ్యక్తం చేయడమే కాకుండా ఈ విషయాన్ని రికార్డుల్లో నమోదు చేసింది. రిజిస్ట్రార్ జ్యుడీషియల్‌ను పిలిపించి పిటిషనర్ అందజేసే పత్రాలను సీల్డ్ కవర్లో ఉంచి తదుపరి విచారణ సమయంలో అందజేయాలని ఆదేశించింది. విచారణను మంగళవారానికి వాయిదా వేస్తూ జస్టిస్ ఆర్ రఘునందన్‌రావు, జస్టిస్ టిసిడి శేఖర్‌తో కూడిన ధర్మాసనం ఆదేశించింది.

గుంటూరు జిల్లా జైలు నుండి విడుదలైన తన భర్త తురకా కిషోర్‌ను పల్నాడు జిల్లా, రెంటచింతల పోలీసులు అక్రమంగా నిర్బంధించారంటూ ఆయన భార్య తురకా సురేఖ హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. తన భర్తపై 12 కేసులు పెట్టారన్నారని, ఒక కేసులో బెయిల్ వస్తే మరో కేసులో అరెస్టు చేస్తున్నారని చెప్పారు. దీనిపై గత విచారణ సమయంలో హైకోర్టు, కిషోర్‌పై ఎన్ని కేసులున్నాయో, ఏ కేసులో ఎప్పుడు అరెస్టు చేశారో, ఎప్పుడు బెయిల్ వచ్చిందో, మళ్లీ ఎప్పుడు అరెస్టు చేశారో.. తదితర వివరాలను పట్టిక రూపంలో నివేదించాలని పల్నాడు జిల్లా ఎస్పికి ఆదేశించింది. సోమవారం జరిగిన విచారణలో ఆ వివరాలను పరిశీలించిన హైకోర్టు పైవిధంగా ప్రశ్నించింది.

# కుంకీ ఏనుగుల తొలి ఆపరేషన్ విజయవంతం

(మొదటిపేజీ తరువాయి)

సమస్యకు పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. రాష్ట్రంలో తొలిసారిగా చేపట్టిన 'ఆపరేషన్ కుంకీ' విజయవంతమైందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రకటించారు. చిత్తూరు జిల్లా, బంగారుపాళ్యం మండలం మొగిలి ప్రాంతంలో పంటలను ధ్వంసం చేస్తున్న అడవి ఏనుగుల గుంపును.. శిక్షణ పొందిన కుంకీ ఏనుగులు విజయవంతంగా అడవిలోకి తరిమికొట్టాయని వెల్లడించారు. ఈ ఆపరేషన్ సఫలం కావడంతో సరిహద్దు ప్రాంతాల రైతులకు భరోసా లభించినట్లయిందని పేర్కొన్నారు.

"గత 15 రోజులుగా మొగిలి ప్రాంతంలోని మామిడి తోటలపై అడవి ఏనుగుల గుంపు దాడులు చేస్తూ తీవ్ర నష్టం కలిగిస్తోంది. ఈ సమాచారంతో అప్రమత్తమైన అటవీ శాఖ అధికారులు 'ఆపరేషన్ కుంకీ'కి శ్రీకారం చుట్టారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు ఈ ఆపరేషన్‌ను కొనసాగించారు. ఇందులో భాగంగా కర్ణాటక నుంచి ప్రత్యేకంగా తెప్పించిన కృష్ణ, జయంత్, వినాయక అనే మూడు కుంకీ ఏనుగులను రంగంలోకి దించారు. ఈ కుంకీలు అడవి ఏనుగుల గుంపును ధైర్యంగా ఎదుర్కొని, తిరిగి అటవీ ప్రాంతంలోకి వెళ్లేలా దారి మళ్లించాయని అధికారులు తెలిపారు. ముఖ్యంగా 'కృష్ణ' అనే కుంకీ చాలా చురుగ్గా వ్యవహరించి ఆపరేషన్ విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషించిందని వారు పేర్కొన్నారు. మొగిలి ప్రాంతంలో 15 రోజులుగా ఏనుగుల సంచారం ఉన్న సమాచారంతో అధికారులు ఈ ఆపరేషన్ చేపట్టారు. కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులను తీసుకువచ్చిన అనంతరం రెండు నెలల శిక్షణ తర్వాత మొదటి ఆపరేషన్ విజయవంతంగా చేపట్టడం ఆనందాన్నిచ్చింది. ఏనుగుల సంచారంతో ఇబ్బందులు పడుతున్న సరిహద్దు ప్రాంతాల రైతులు, ప్రజలకు ఈ ఆపరేషన్ భరోసా ఇస్తుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు గారి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఏనుగుల గుంపు నుంచి పంటలను, ప్రజల ప్రాణాలు కాపాడే దిశగా ప్రణాళికాబద్ధంగా పని చేస్తుంది అనడానికి కుంకీలతో చేపట్టిన ఆపరేషన్ తొలి అడుగు. ఈ ఆపరేషన్ లో పాల్గొన్న అటవీ అధికారులకు, మావటీలు, కావడిలకు అభినందనలు తెలియజేస్తున్నాను. అలాగే అడిగిన వెంటనే కుంకీ ఏనుగులు రాష్ట్రానికి ఇచ్చి సహకరించిన కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గారికి, ఆ రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే గారికి మరోసారి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. తదుపరి ఆపరేషన్ పుంగనూరు అటవీ ప్రాంతంలో చేపట్టేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు" అని పవన్ కల్యాణ్ వెల్లడించారు.

# మోడీకి చంద్రబాబు దాసోహం

(మొదటిపేజీ తరువాయి)

శ్రీకాకుళంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్ పరం చేయకుండా ఆపే దమ్ముందా? అని చంద్రబాబును ప్రశ్నించారు. బిజెపికి జనం ఓట్లు వేయకపోయినా రాష్ట్రంలోని ఎంపిలందరూ బిజెపి వారేనని ఎద్దేవా చేశారు. ఎన్‌డిఎ ప్రభుత్వ హయాంలో ఆర్థిక, రక్షణ వ్యవస్థలతో పాటు విదేశాంగ విధానం నిర్వీర్యమైందని విమర్శించారు. ఎన్‌డిఎ ప్రభుత్వ వైఖరితో ప్రపంచ దేశాల ముందు తలదించుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. ట్రంప్ తన ఫ్రెండ్ అని చెప్పిన మోడీ.. 25 శాతం సుంకాలు విధించారని, దీనికి ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు.

## సంపాదకీయం

### ఆంక్షలకు భయపడితే
# రూ.96 వేల కోట్ల భారం!



అమెరికా అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్ వాణిజ్య యుద్ధాన్ని మొదలు పెట్టినప్పుడు.. ఉద్యోగాలను, తయారీని తిరిగి తమ దేశానికి తీసుకు రావడం, వాణిజ్య లోటును తగ్గించడం, ప్రపంచవ్యాప్తంగా పోటీ పడుతున్న అమెరికా కంపెనీలకు మరింత పారదర్శక వాతావరణాన్ని సృష్టించడం తన లక్ష్యమని చెప్పారు. అయితే, నెలల తరబడి చర్చల తర్వాత అమెరికా డిమాండ్లను నెరవేర్చేందుకు చాలా దేశాలు నిరాకరించడంతో, ఆయన వ్యూహం కఠినాత్మకంగా మారింది.అమెరికా కంపెనీలు చాలాకాలంగా వివిధ దేశాలలో తమ కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయి.

ట్రంప్ తన తొలి పదవీ కాలంలో చైనా ఎగుమతులపై సుంకాలను విధించినప్పుడు, బీజింగ్‌లో ఉన్న అమెరికా కంపెనీలు తమపై పడే ప్రభావాన్ని తగ్గించుకునేందుకు నానా తంటాలు పడ్డాయి.భారత్ అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం కుదరకపోవడంతో అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్ట్ ట్రంప్ 25 శాతం సుంకాలు విధిస్తామని ప్రకటించారు. అలాగే రష్యా నుంచి చమురు దిగుమతులు చేసుకుంటే అదనంగా పెనాల్టీలు విధిస్తామని, వెంటనే రష్యా ఆయిల్ కొనుగోలు ఆపేయాలని హెచ్చరించారు. అయితే, రష్యా నుంచి తక్కువ ధరకే ఆయిల్ కొంటున్న భారత్ ఇప్పుడు ట్రంప్ బెదిరింపులకు భయపడి ఆపేస్తే భారీగా భారం మోయాల్సి వస్తుంది. ప్రతి ఏడాది రూ.96 వేల కోట్ల వరకు భారం పడుతుందిభారత్ నుంచి తమ దేశంలోకి దిగుమతి అయ్యే వస్తువులపై 25 శాతం సుంకాలు, అదనంగా జరిమానాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు.

ఆగస్టు 1వ తేదీ నుంచే ఈ సుంకాలను అమలులోకి తీసుకొచ్చారు. అయితే, అదనంగా విధించే పెనాల్టీలపై ఇంకా స్పష్టత రాలేదు. అయితే, రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు ఆపకపోతే భారీగా పెనాల్టీలు తప్పవని ట్రంప్ బెదిరింపులకు దిగిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ట్రంప్ బెదిరింపులకు భారత్ భయపడి రష్యా చమురు దిగుమతులను తగ్గించుకున్నట్లయితే భారీగా భారం మోయాల్సి వస్తుందని విశ్లేషకులు చెబుతున్నారు. రష్యా చమురు దిగుమతులను తగ్గిస్తే ఇండియాపై ప్రతిసంవత్సరం 9-11 బిలియన్ డాలర్ల మేర అంటే సుమారు రూ.78000- 96000 కోట్ల వరకు భారం పడవచ్చని అంచనా వేస్తున్నారు.

ప్రస్తుతం ప్రపంచంలో మూడో అతిపెద్ద చమురు వినియోగదారు, దిగుమతిదారుగా భారత్ ఉంది. 2022లో రష్యా- ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైంది. ఆ తర్వాత రష్యా చమురుపై పశ్చిమ దేశాలు ఆంక్షలు విధించాయి. ఈ క్రమంలో చమురు ఎగుమతులు పెంచుకునేందుకు రష్యా రాయితీలు ప్రకటించింది. ఈ పరిస్థితులను సద్వినియోగం చేసుకున్న భారత్ రాయితీ ధరలకే రష్యా నుంచి భారీగా చమురు దిగుమతి చేసుకుని గణనీయంగా లబ్ధి పొందింది. ఉక్రెయిన్‌తో యుద్ధానికి ముందు భారత చమురు దిగుమతుల్లో రష్యా చమురు వాటా 0.2 శాతం కంటే తక్కువే. కానీ, ఇప్పుడు అది 35-40 శాతానికి పెరిగింది.

ఫలితంగా భారత దిగుమతి భారత్ గణనీయంగా తగ్గింది. రిటైల్ ఇంధన ధరలు, ద్రవ్యోల్బణం అదుపులో ఉండేందుకు దోహదపడింది.రష్యా నుంచి దిగుమతి అయిన రాయితీ క్రూడ్ ఆయిల్‌ను శుద్ధి చేసి, ఆ దేశంపై ఆంక్షలు విధించిన దేశాలకు భారత్ ఎగుమతి చేసింది. ఈ ద్విముఖ వ్యూహంతో భారత్ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు భారీగా లాభం పొందాయి. అయితే, ఇప్పుడు భారత వస్తువులపై 25 శాతం టారిఫ్ విధిస్తామని అమెరికా ప్రకటించింది. రష్యా ఆయిల్, ఆయుధాలు కొంటే అదనంగా పెనాల్టీలు వేస్తామని హెచ్చరించింది.

ఈ 25 శాతం సుంకాలు ఇప్పటికే నోటిఫై చేసింది. కానీ, పెనాల్టీలపై స్పష్టత లేదు. రష్యా చమురు నుంచి ఉత్పత్తి చేసే వాటి దిగుమతులపై 2026, జనవరి నుంచి యూరోపియన్ యూనియన్ నిషేధం విధించింది. ఈ నిర్ణయం భారత ఆయిల్ సంస్థలకు ఇబ్బందులు రెట్టింపు చేస్తుంది.గత సంవత్సరం ముడి చమురు దిగుమతులపై భారత్ 137 బిలియన్ డాలర్ల మేర ఖర్చు చేసింది. భారత్‌లోకి రోజుకు 1.7-2 మిలియన్ బ్యారెళ్ల రష్యా ఆయిల్ దిగుమతి అయింది.

ఇందులో రిలయన్స్ ఇండస్ట్రీస్, నయారా వాటానే 50 శాతం కంటే ఎక్కువ. అయితే రష్యా చమురు దిగ్గజం రాస్ నెస్టుకు చెందిన నయారాపై ఐరోపా సమాఖ్య ఆంక్షలు విధించింది. ప్రస్తుతం ఐరోపాకు అతిపెద్ద ఆయిల్ ఎక్స్‌పోర్టర్ గా రిలయన్స్ ఉంది. 2024లో చూసుకుంటే రోజుకు సగటున 2 లక్షల బ్యారెళ్లు, 2025లో ఇప్పటి వరకు రోజుకు 1,85,000 బ్యారెళ్లను ఎగుమతి చేసింది. రష్యా చమురుతో రెండేళ్లలో రిలయన్స్ భారీగా మార్జిన్లను పెంచుకుంది. అయితే, తాజా ఆంక్షలతో ఇతర మార్కెట్లపై దృష్టి సారించాల్సిన అవసరం ఏర్పడింది.

మరో వైపు ఆసియా దేశాలతో అమెరికా జరుపుతున్న చర్చలలో ట్రాన్స్‌షిప్పింగ్ అనేది అతిపెద్ద అంశంగా ఉంది.వియత్నాం దిగుమతులు 20 శాతం అమెరికా లెవీని ఎదుర్కొంటుండగా, ట్రాన్స్‌షిప్డ్ గూడ్స్ అయితే 40 శాతం చెల్లించాల్సి వస్తుందని ట్రంప్ చెబుతున్నారు.సెమీకండక్టర్లు వంటివాటి తయారీకి కూడా ఇది చాలా కష్టం. ఎందుకంటే, ప్రపంచ చిప్‌లలో సగానికి పైగా, ముఖ్యంగా అధునాతనమైన వాటిలో ఎక్కువ భాగం తైవాన్ నుంచే వస్తున్నాయి. వీటికి ప్రస్తుతం 20 శాతం టారిఫ్‌ను చెల్లించాలి.

ఇప్పుడు ఈబే వంటి అమెరికన్ సైట్లు కూడా ఈ మినహాయింపును కోల్పోయాయి. దీంతో, అమెరికా కస్టమర్లు కొనుగోలు చేసే సెకండ్ హ్యాండ్, వింటేజ్, చేతితో తయారు చేసిన వస్తువుల ధరలు విపరీతంగా పెరగనున్నాయి.

అమెరికన్ల కోసం ఈ టారిఫ్‌లతో బ్యాటింగ్ చేస్తున్నట్లు అధ్యక్షుడు ట్రంప్ చెబుతున్నారు.కానీ, ప్రపంచీకరణ అయిన ఈ సమాజంలో అమెరికా కంపెనీలు, వినియోగదారులు కూడా బాధితులు అవ్వొచ్చు. ఈ విషయంలో ఎంతో అనిశ్చితి ఉంది. అసలైన విజేతలు ఎవరనేది ముమ్ముందు తెలుస్తుంది.

## చంద్రుడిపై కాలు మోపిన
# మొట్టమొదటి మానవుడు నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్

**- నేడు నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ జయంతి**



చంద్రుడిపై కాలు మోపిన మొదటి మానవుడు నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ ఇతను ఒక పూర్వపు వ్యోమగామి, పరీక్షా చోదకుడు (పైలట్), విశ్వవిద్యాలయపు ప్రొఫెసర్, యుఎస్. నావికదళ చోదకుడు (అవియేటర్). ఇతడి మొదటి అంతరిక్ష నౌక జెమినీ 8 1966లో ప్రయోగించినప్పుడు, దీనికి ఇతను మొదటి కమాండ్ పైలట్. ఈ కార్యక్రమంలో, మొదటి మానవ సహిత అంతరిక్ష నౌకలో తోటి పైలట్ డేవిడ్ స్కాట్తో ప్రయాణించాడు. ఆర్మ్‌స్ట్రాంగ్ యొక్క రెండవ, ఆఖరి దఫా అంతరిక్ష ప్రయాణం అపోలో 11 చంద్రుడిపై యాత్ర మిషన్ కొరకు జూలై 20 1969 న ప్రయోగించబడింది. ఈ మిషన్ లో ఆర్మ్‌స్ట్రాంగ్, బజ్ ఆల్డ్రిన్ చంద్రుడిపై కాలుమోపి రెండున్నర గంటల సమయం సంచరించారు. ఆ సమయంలో మైకేల్ కాలిన్స్ కమాండ్ మాడ్యూల్ నందే ఉండి కక్ష్యలో పరిభ్రమించసాగాడు. ఆర్మ్‌స్ట్రాంగ్ కు అంతరిక్షయాత్రల గౌరవ పతాకం ప్రసాదింపబడింది... ఆర్మ్‌స్ట్రాంగ్ ఒహియోలోని వాపకోనెటాలో ఆగస్టు 5, 1930న పుట్టి పెరిగాడు . పర్డ్యూ విశ్వవిద్యాలయంలో గ్రాడ్యుయేట్ , అతను ఏరోనాటికల్ ఇంజనీరింగ్ చదివాడు; అతని కళాశాల ట్యూషన్ కోసం యుఎస్ నావికాదళం హోలోవే ప్లాన్ కింద చెల్లించింది .

అతను 1949లో మిడ్‌షిప్‌మ్యాన్ అయ్యాడు. మరుసటి సంవత్సరం నౌకాదళ ఏవియేటర్ అయ్యాడు. అతను కొరియన్ యుద్ధంలో చర్యను చూశాడు. విమాన వాహక నౌక యుఎస్‌ఎస్ ఎసెక్స్ నుండి గ్రుమ్మన్ ఎఫ్9ఎఫ్ పాంథర్‌ను ఎగురవేసాడు. . సెప్టెంబరు 1951లో, తక్కువ బాంబింగ్ రన్ చేస్తున్న పుడు, ఆర్మ్‌స్ట్రాంగ్ యొక్క విమానం ఒక లోయకు అడ్డంగా ఉన్న యాంటీ-ఎయిర్‌క్రాఫ్ట్ కేబుల్‌తో ఢీకొన డంతో దెబ్బతింది, ఇది ఒక రెక్కలో ఎక్కువ భాగాన్ని కత్తిరించింది. ఆర్మ్‌స్ట్రాంగ్ బలవంతంగా బెయిల్‌ను పొందవలసి వచ్చింది. యుద్ధం తరువాత, అతను పర్డ్యూలో తన బ్యాచిలర్ డిగ్రీని పూర్తి చేసాడు మరియు కాలిఫోర్నియాలోని ఎడ్వర్డ్స్ ఎయిర్ ఫోర్స్ బేస్ వద్ద నేషనల్ అడ్వైజరీ కమిటీ ఫర్ ఏరోనాటిక్స్ (నాసా) హై-స్పీడ్ ఫ్లైట్ స్టేషన్‌లో టెస్ట్ పైలట్ అయ్యాడు. అతను సెంచరీ సిరీస్ యుద్ధ విమానాలపై ప్రాజెక్ట్ పైలట్ మరియు ఉత్తర అమెరికా యెక్స్-15 ని ఏడుసార్లు నడిపాడు. అతను యుఎస్ ఎయిర్ ఫోర్స్ యొక్క మ్యాన్ ఇన్ స్పేస్ సూనెస్ట్, యెక్స్-20 డైనా-సోర్‌లో కూడా పాల్గొన్నాడు. మానవ అంతరిక్ష ప్రయాణ కార్యక్రమాలు. ఆర్మ్‌స్ట్రాంగ్ నాసా ఆస్ట్రోనాట్ కార్ప్స్‌లో రెండవ సమూహంలో చేరాడు , ఇది 1962లో ఎంపిక చేయబడింది. అతను మార్చి 1966లో జెమిని 8 యొక్క కమాండ్ పైలట్‌గా తన మొదటి అంతరిక్ష ప్రయాణాన్ని చేసాడు, అంతరిక్షంలో ప్రయాణించిన నాసా యొక్క మొట్టమొదటి పౌర వ్యోమగామిగా నిలిచాడు. పైలట్ డేవిడ్ స్కాట్‌తో ఈ మిషన్ సమయంలో , అతను రెండు అంతరిక్ష నౌకలను మొదటి డాకింగ్ చేశాడు. ఆర్మ్‌స్ట్రాంగ్ తన రీ-ఎంట్రీ కంట్రోల్ ఫ్యూయెల్‌లో కొంత భాగాన్ని ఇరుక్కుపోయిన థ్రస్టర్ వల్ల ఏర్పడే ప్రమాదకరమైన రోల్‌ను స్థిరీకరించడానికి ఉపయోగించిన తర్వాత మిషన్ రద్దు చేయబడింది. అపోలో 11 యొక్క కమాండర్‌గా ఆర్మ్‌స్ట్రాంగ్ యొక్క రెండవ మరియు చివరి అంతరిక్షయానం కోసం శిక్షణ సమయంలో , అతను లూనార్ ల్యాండింగ్ రీసెర్చ్ వెహికల్ నుండి బయటకు వెళ్లవలసి వచ్చింది.క్రాష్‌కి క్షణాల ముందు. జూలై 20, 1969న, ఆర్మ్‌స్ట్రాంగ్ అపోలో 11 లూనార్ మాడ్యూల్ పైలట్ బజ్ ఆల్డ్రిన్ చంద్రునిపై ల్యాండ్ చేసిన మొదటి వ్యక్తులు అయ్యారు , జులై 20, 1969న మానవ జాతి చరిత్రలో ఓ అద్భుతం ఆవిష్కృతమైంది. అప్పటివరకు భూగోళానికే పరిమితమైన మనిషి తన ప్రస్థానాన్ని మరో ప్రపంచంలో ప్రారంభించాడు. తొలిసారిగా చందమామను అందు కున్నాడు. లక్షల మంది శ్రమ, కోట్లాది మంది ఆశలు, ఆకాంక్షలు నెరవేరిన శుభదినం. అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసాకు చెందిన అపోలో-11 వ్యోమనౌక ద్వారా వ్యోమగాములు నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, మైకెల్ కొల్లిన్స్, ఎడ్విన్ ఇ అల్డ్రిన్‌ను చంద్రుడిపైకి పంపింది. వీరిలో నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ మొదటిగా చంద్రుడిపై కాలు మోపి రికార్డులకు ఎక్కాడు. ఆర్మ్‌స్ట్రాంగ్ అడుగుపెట్టిన 20 నిమిషాల తర్వాత.. అల్డ్రిన్ చంద్రుడిపై కాలు మోపాడు. వాళ్లు దాదాపు 21 గంటలు చంద్ర మండలంపై గడిపారు.ఇక, చంద్రుడిపై ఏముందో తెలుసుకోడానికి తొలిసారిగా ప్రయోగాలు చేసిన దేశం.. రష్యా. సోవియట్ 1957లో తొలి కృత్రిమ ఉపగ్రహం స్పుత్నిక్‌ను ప్రయోగించింది. 1959లో లూనా-2 ద్వారా చంద్రుడిపై తొలిసారి ఉపగ్రహాన్ని పంపింది.


ఇది విజయవంతం కావడంతో 1961 ఏప్రిల్ 21న ఇద్దరు వ్యోమగాములను అంతరి క్షంలోకి పంపి చరిత్ర సృష్టించింది. దీనిని స్ఫూర్తిగా తీసుకున్న అమెరికా నేరుగా వ్యోమగాములను పంపాలనే సాహోసేత నిర్ణయం తీసుకుంది. చంద్రుడిపైకి మానవ సహిత యాత్ర కోసం నాసా అపోలో మిషన్ చేపట్టింది. దీనికోసం దాదాపు 2,500 కోట్ల డాలర్లు ఖర్చుచేయగా, దాదాపు 4 లక్షల మంది నిపుణులు పనిచేశారు.1969 జులై 16న జాన్ ఎఫ్ కెన్నడీ అంతరిక్ష కేంద్రం నుంచి శాటర్న్-5 అనే రాకెట్ ద్వారా అపోలో-11 వ్యోమనౌక అంతరిక్షంలోకి పంపారు. 110 గంటల సుదీర్ఘ ప్రయాణం తర్వాత జులై 20న అపోలో-11 చంద్రుడిపై దిగింది. వ్యోమగాములు నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, మైకేల్ కొలిన్స్ లూనార్ మాడ్యూల్‌లో చంద్రుడి ఉపరితలంపై అడుగుపెట్టారు. మరో వ్యోమగామి బజ్ ఆల్డ్రిన్ కమాండ్ మాడ్యూల్‌లో ఉండి వారిని తిరిగి సురక్షితంగా భూమికి చేర్చడానికి సహకరించారు. లూనార్ మాడ్యూల్ చంద్రుడి ఉపరితలంపై ఉన్న సీ ఆఫ్ ట్రాన్‌క్విలిటీ అనే ప్రాంతంలో దిగింది.ఆర్మ్‌స్ట్రాంగ్ చంద్రుడిపై దిగిన 20 నిమిషాల తర్వాత కొలిన్స్ అడుగుపెట్టాడు. 'ఇది మనిషిగా ఒక చిన్న అడుగు.. మానవాళికి మాత్రం భారీ గెంతు' అని ఈ సందర్భంగా ఆర్మ్‌స్ట్రాంగ్ గట్టిగా అరిచారు. చంద్రుడి ఉపరితలంపై దాదాపు రెండు గంటలు గడిపారు. అక్కడ అమెరికా జెండాను నాటారు. చంద్ర శిలలు, మట్టి నమూనాలను సేకరించి, ఫొటోలు తీసుకొని, ప్రయోగ పరికరాలను అక్కడ వదిలేసి తిరుగు ప్రయాణమయ్యారు. అక్కడ నుంచి బయలుదేరిన నాలుగు రోజుల తర్వాత జులై 24న పసిఫిక్ మహా సముద్రంలోకి అపోలో-11 సురక్షితంగా దిగింది. వ్యోమగాములు చంద్రుడి ఉపరితలం నుంచి సేకరించిన దాదాపు 21.5 కిలోల రాళ్లు, మట్టి నమూనాలను పరిశోధనల కోసం వివిధదేశాలకు నాసా పంపిణీ చేసింది. ఆస్ట్రోనాట్లు చంద్రుడిపై దిగడాన్ని టీవీల్లో ప్రత్యక్ష ప్రసారం చేయగా, ప్రపంచవ్యాప్తంగా 65 కోట్ల మంది దీన్ని వీక్షించినట్లు అంచనా. నాటి అమెరికా అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ టెలిఫోన్-రేడియో ట్రాన్స్‌మిషన్ ద్వారా వ్యోమగాములతో మాట్లాడారు. వైట్‌హౌస్ నుం చి చేసిన చారిత్రక ఫోన్‌కాల్ ఇది అని అభివర్ణించారు. అప్పట్లో వాళ్లు ఉపయోగించిన గైడెన్స్ సిస్టమ్ కేవలం 64 కేబీ మెమరీ ర్యామ్‌తోనే పనిచేయడం గమనార్హం. అంటే, మన స్మార్ట్ ఫోన్‌లోని ఉన్న మెమరీ కంటే చాలా తక్కువ. అప్పుడప్పుడే టెక్నాలజీ ఓనమాలు నేర్చుకుంటున్న సమయంలో నాసా ఏకంగా మనిషిని చంద్ర మండలంపై పంపిందంటే సాధారణ విషయం కాదు.... ఆర్మ్‌స్ట్రాంగ్ మొదటిసారి చంద్రుని ఉపరితలంపైకి అడుగుపెట్టినప్పుడు, అతను ప్రముఖంగా ఇలా అన్నాడు: "ఇది మనిషికి ఒక చిన్న అడుగు, మానవజాతికి ఒక పెద్ద ఎత్తు." ఇది ప్రపంచవ్యాప్తంగా 530 మిలియన్ల మంది వీక్షకులకు ప్రత్యక్ష ప్రసారం చేయబడింది. అపోలో 11 అంతరిక్ష పోటీలో యుఎస్ విజయాన్ని సమర్థవంతంగా నిరూపించింది.

1961లో అధ్యక్షుడు జాన్ ఎఫ్. కెన్నెడీ ప్రతిపాదించిన జాతీయ లక్ష్యాన్ని నెర వేర్చడం ద్వారా , దశాబ్దం ముగిసేలోపు "చంద్రునిపై మనిషిని దింపడం, భూమికి సురక్షితంగా తిరిగి రావడం". కాలిన్స్ ఆల్డ్రిన్‌లతో పాటు, ఆర్మ్‌స్ట్రాంగ్‌కు ప్రెసి డెంట్ రిచర్డ్ నిక్సన్ ద్వారా ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడం లభించింది 1969 కొలియర్ ట్రోఫీని అందుకున్నారు. ప్రెసిడెంట్ జిమ్మీ కార్టర్ అతనికి 1978లో కాంగ్రెషనల్ స్పేస్ మెడల్ ఆఫ్ ఆనర్‌ను అందించాడు. అతను 1979లో నేషనల్ ఏవియేషన్ హాల్ ఆఫ్ ఫేమ్ లోకి ప్రవేశించబడ్డాడు అతని మాజీ సిబ్బందితో కలిసి 2009 లో కాంగ్రెషనల్ గోల్డ్ మెడల్ అందుకున్నాడు. అతను 1971లో నాసా నుండి వైదొలిగిన తర్వాత, ఆర్మ్‌స్ట్రాంగ్ 1979 వరకు సిన్సినాటి విశ్వవిద్యాలయంలో ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగంలో బోధించాడు . అతను అపోలో 13 ప్రమాద పరిశోధనలో రోజర్స్ కమిషన్‌లో పనిచేశాడు. ఇది స్పేస్ షటిల్ ఛాలెంజర్ విపత్తును పరిశోధించింది. ఆగష్టు 25, 2012లో ఆర్మ్‌స్ట్రాంగ్ 82 సంవత్సరాల వయస్సులో కరోనరీ బైపాస్ సర్జరీ వల్ల ఏర్పడిన సమస్యల కారణంగా మరణించాడు.

# కామన్ మ్యాన్ మాదిరిగా సీఎం

**సీబీఎన్ 2.0**

**విజయవాడ - సూర్య వాస్తవం**



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిలో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. పాలనా విధానంలోనే కాదు.. ప్రజలతో మమేకమయ్యే తీరు కూడా మారింది. నారా చంద్రబాబు నాయుడు ఏపీ సీఎం అప్పుడప్పుడు కామన్ మ్యాన్‌లానూ మారిపోతున్నారు. ఒకప్పటి చంద్ర బాబుకు.. ఇప్పుడు కనిపిస్తున్న చంద్రబాబుకు చాలా తేడా ఉంది. ప్రజాసేవే అసలైన రాజకీయం అని నమ్మిన నాయ కుడు.. ఆ ప్రజలతోనే మమేకమవుతున్నారు. జనంలో ఉంటున్నారు. జనంలా ఉంటున్నారు. చంద్రబాబు గతంలో సీఎంగా ఉన్నప్పుడు.. ఎక్కువగా పరిపాలనలోనే బిజీగా ఉండేవారు. ఆఫీసుకే పరిమితమయ్యేవారు. ఇప్పుడు ప్రజల మధ్యకే నేరుగా వెళ్తున్నారు. సీఎం అంటే సిన్సియర్‌గా పాలనపై దృష్టిపెట్టడమే కాదు.. అప్పుడప్పుడు సింపుల్‌గా ఇలా జనాలతో కనెక్ట్ అవడం కూడా అనే కొత్త ఒరవడికి చంద్రబాబు శ్రీకారం చుట్టారు. సింప్లిసిటీ అంటే ఏమిటో చూపించిన సీఎం.

**జూలై 2 వ తేదీ.. తూర్పుగోదావరి జిల్లా...**

రెండు కిలోమీటర్లమేర పోశిబాబును తన కారులో వెంటపెట్టుకుని చర్మకారుని ఇంటికి చంద్రబాబు వెళ్లారు. కొవ్వూరు నియోజకవర్గంలోని ధర్మవరంనుంచి మలకపల్లి వరకూ తన కారులోనే పోశిబాబును ఎక్కించుకుని సీఎం ప్రయాణించారు. కారులో వెళ్తూ పోశిబాబుతో ముఖ్యమంత్రి వివిధ అంశాలపై మాట్లాడారు. పోశిబాబునుంచి సాధక బాధకాలను అడిగి తెలుసుకున్నారు. చర్మకారుడు పోశిబాబు కుటుంబ సభ్యుల వివరాలు, వాళ్లు ఏం చేస్తున్నారనే అంశంపై ఆరా తీశారు

**ఆగస్టు 2వ తేదీ ప్రకాశం జిల్లా..**

ప్రకాశం జిల్లా దర్శిలో అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని కూడా ఎప్పటిలా కాకుండా.. వినూత్నంగా ప్రారం భించారు. సీఎం చంద్రబాబు. భారీ వేదిక లేదు.. భారీ టెంట్లు లేవు.. కుర్చీలు లేవు.. దద్దరిల్లిపోయే సౌండ్ లేదు.. దిమ్మతిరిగిపోయే ఏర్పాట్లు లేవు. మండుటెండలో.. పంటల పొలాల మధ్యలో.. రైతన్నల సమక్షంలోనే.. సూపర్ సిక్స్ హామీల్లో కీలకమైన అన్నదాత సుఖీభవ పథకాన్ని.. ప్రశాంతమైన వాతావరణంలో విజయ వంతంగా నెరవేర్చింది. కూటమి ప్రభుత్వం. కల్లంలో ఏర్పాటు చేసిన మంచం మీదే కూర్చున్నారు. రైతులతో పాటే సింపుల్‌గా కుర్చీలో రిలాక్స్ అయ్యారు. సూపర్ సిక్స్ పథకాల ద్వారా రెట్టింపు సంక్షేమం అందుకున్న ప్రజలు సంతోషంగా ఉన్నారని.. ఇంతకంటే తనకు కావాల్సిందే ముందని బాబు చెబుతున్న తీరు చూస్తుంటే.. ఆయనలో వచ్చిన మార్పు స్పష్టంగా కనిపిస్తోంది.

**రోజుకు ఒక్కసారైనా నన్ను తలుచుకుంటారా...**

ఎన్ని కష్టాలున్నా.. అవన్నీ తన వరకే పరిమితమని.. జనం సుఖ,సంతోషాలతో ఉండాలనేదే తన ఆకాంక్ష అని అంటున్నారు. రోజుకు ఒక్కసారైనా తనని తలుచుకుంటారా? అని జనాన్ని అడగడం కూడా కొత్తగా కనిపిస్తోంది. రాజకీయ నేతగా, సీఎంగా.. చంద్రబాబు రాజకీయ జీవితం ఎప్పుడూ విజన్, క్రమశిక్షణ, అభివృద్ధి అనే వాటి చుట్టే తిరుగుతూ ఉంటుంది. కానీ.. నవ్యాంధ్రప్రదేశ్ సీఎంగా రెండోసారి అధికారం చేపట్టాక.. బాబులో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. పేదల సేవ అనే కార్యక్రమంతో.. జనంతో మమేకమై, వారి మధ్యే ఎక్కువ సమయం గడుపుతున్నారు. పేదల సేవకు పెద్దపీట వేస్తూ, ప్రభుత్వ పథకాలను నేరుగా ప్రజల మధ్యకు తీసుకెళ్తూ కొత్త ఒరవడి సృష్టించారు. ఈ మార్పు కేవలం రాజకీయ వ్యూహం మాత్రమే కాదు.. రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచాలనే నిజమైన సంకల్పానికి నిదర్శనం. టెక్నాలజీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఆర్థిక వృద్ధిపైనే దృష్టి. నిజానికి చంద్రబాబు ఎప్పుడు సీఎంగా ఉన్నా.. టెక్నాలజీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఆర్థిక వృద్ధిపై దృష్టి సారించిన నాయకుడిగానే కనిపించేవారు.

# పీజీఆర్ఎస్ అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలి

**- ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ**



**అనంతపురం కలెక్టరేట్ – సూర్య వాస్తవం, ఆగస్టు 04 :** అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్)కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ఆయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి ఇంచార్జి జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ అర్జీలను స్వీకరించారు. ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ తో పాటు అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, జిల్లా రెవెన్యూ అధికారి ఏ.మలోల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తిప్పేనాయక్, రామ్మోహన్, మల్లికార్జునుడు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమా మహేశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 463 అర్జీలను ఇంచార్జి జిల్లా కలెక్టర్ స్వీకరించారు.

ఈ సందర్భంగా ఇంచార్జి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... పిజిఆర్ఎస్ అర్జీలను నాణ్యతగా పరిష్కరించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో ఎలాంటి అలసత్వం ఉండరాదన్నారు. ఆయా శాఖల జిల్లా అధికారులు ఎలాంటి పెండింగ్ లేకుండా గడువుతీరక ముందే సకాలంలో, ఎప్పటికప్పుడు అర్జీలకు పరిష్కారం చూపించాలన్నారు. అర్జీలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. జీరో పావర్టీ పి4కి సంబంధించి మార్గదర్శుల గుర్తింపును వేగవంతం చేయాలని, ఇందులో వెనుకబడిన ఆయా మండలాల అధికారులకు నోటీసులు ఇవ్వాలన్నారు. మార్గదర్శుల గుర్తింపులో పురోగతి తీసుకురావాలని, ప్రభుత్వ లక్ష్యాలను చేరుకునేందుకు కృషి చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ ఆనంద్, సిపిఓ అశోక్ కుమార్, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, జిల్లా సైనిక్ సంక్షేమ శాఖ అధికారి పి.తిమ్మప్ప, హౌసింగ్ పిడి శైలజ, డిటిసి వీర్రాజు, డివిఈఓ వెంకటరమణ నాయక్, మైన్స్ డిడి ఆదినారాయణ, డ్వామా పిడి సలీమ్ భాష, ఏపీఎంఐపి పిడి రఘునాథరెడ్డి, జిజిహెచ్ సూపరింటెండెంట్ డా.ఆత్మారావు, డిఈఓ ప్రసాద్ బాబు, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డా.కిరణ్ కుమార్ రెడ్డి, బీసీ వెల్ఫేర్ డిడి కుష్బూ కొఠారి, ఎపిఎస్పిడిసిఎల్ ఎస్ఈ శేషాద్రిశేఖర్, కలెక్టరేట్ సెక్షన్ ల సూపరి ంటెండెంట్లు యుగేశ్వరిదేవి, వసంతలత, రియాజుద్దీన్, కలెక్టరేట్ ఏవో అలెగ్జాండర్, పిజిఆర్ఎస్ తహసీల్దార్ వాణిశ్రీ, ఆయా శాఖల జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ నులి పురుగుల నిర్మూలన

# కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం, ఆగస్టు 04:** జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం" విజయవంతం చేద్దామని అన్నమయ్య జిల్లా కలెక్టర్ సి. శ్రీధర్, సంయుక్త కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఐఏఎస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు రాయచోటి లోని జిల్లా కలెక్టర్ వారి కార్యాలయంలో ఈనెల 12వ తేదీన నిర్వహించబోవు "జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం" పై గోడ ప్రతిమలు, కర పత్రాలు ఆవిష్క రించారు. మన జిల్లాలో సం. 1 నుండి 19 సం. వయస్సు లోపల గల లక్ష్యం పిల్లలు 396267 మంది ఉన్నారు. వీరందరికీ ఈ నెల 12వ తేదీన అల్బెండజోల్ 400 మీ.గ్రా మాత్రలు మింగించడం జరుగుతుంది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా డీ వార్మింగ్ డే ను ఈ నెల 12వ తేదీన నిర్వహించడం జరుగుతుంది అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, డిగ్రీ, పాలిటెక్నిక్, నర్సింగ్ జూనియర్ కళాశాలలో ఉన్న 1 నుండి 19 సంవత్సరముల లోపు పిల్లలకు అల్బెండజోల్ 400 మీ.గ్రా మాత్రలు మధ్యాహ్నం భోజనం అనంతరం పంపిణీ చేయడం జరుగుతుంది అని తెలిపారు. 12వ తేదీన మాత్రలు తీసుకోని వారి కొరకు ప్రత్యేకంగా ఈ నెల 20వ తేదీన మాప్ అప్ నిర్వహించడం జరుగుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమం అమలు విజయవంతం కొరకు కన్వర్జెన్స్ సమావేశం వైద్య ఆరోగ్య శాఖ, విద్యా శాఖ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ, పురపాలక సంక్షేమ, పంచాయతీ రాజ్, స్వచ్ఛంద సేవా సంస్థలు, జువైనల్ శాఖల తో నిర్వహించడం జరరిగిందని తెలిపారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కొరకు, రక్తహీనత లేని సమాజ స్థాపనకు ప్రతీ సంవత్సరంలో రెండు దఫాలు డీ వార్మింగ్ డే కార్యక్రమంలో భాగంగా అల్బెండజోల్ 400 మీ.గ్రా మాత్రలు రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమంలో భాగంగా పిల్లలు అందరికీ ఉచితంగానే అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలో, అంగన్వాడీ కేంద్రాలలో పంపిణీ చేయడం జరుగుతుంది అన్నారు. విద్యార్థులు లో రక్తహీనత నివారణ చేయడం వల్ల వ్యాధినిరోధక శక్తి పెరగడంతో పాటు, మానసిక, శారీరక పెరుగుదల ఉంటుంది. ముఖ్యంగా కిశోర బాలికలకు ఐరెన్ అత్యంత అవసరమని అందుకే "రక్తహీనత రహిత సమాజ స్థాపనకు అందరం కలిసి పనిచేద్దాం" అని అన్నమయ్య జిల్లా కలెక్టర్ కోరారు. అనంతరం జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం యొక్క గోడ పత్రికలను మరియు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ లక్ష్మి నరసయ్య, అదనపు వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రమేష్ బాబు, జిల్లా రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమ అధికారి డాక్టర్ శివప్రతాప్, %చీఱణ% కోఆర్డినేటర్ ఇంతియాజ్, అర్. బి.ఎస్.కే - డి.ఈ.ఓ వీరనరసింహులు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పి.డి. శశికళ, డి.ఈ.ఓ ఎస్.ఆర్.పురుషోత్తం, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి**
**- అర్జీదారులకు స్నాక్స్, వాటర్ బాటిల్, టీ సౌకర్యాలు**



**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం, ఆగస్టు 04:** ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రజల సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో సోమవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం- పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..... ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరి ంచాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారం పై నేరుగా పర్యవేక్షణ చేయడం జరుగుతోందన్నారు. ప్రతి సమస్యను మరియు ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్ ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందని, కాబట్టి అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరు శాతం పరిష్కరించాలన్నారు. ఇప్పటికే పెండింగ్లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఏ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలన్నారు. సమస్యను పట్టుకొని పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యను సావధానంగా వినాలన్నారు. సమస్య ఏమిటి, దానిని ఎలా పరిష్కరించాలన్న విషయాలపై అధికారులకు అవగాహన ఉండాలని, చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలని పేర్కొన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.

**అర్జీదారులకు స్నాక్స్, వాటర్ బాటిల్, టీ సౌకర్యాలు**

ఎన్నో వ్యయ ప్రయాసలతో, సుదూర ప్రాంతాల నుంచి



జిల్లా కేంద్రం రాయచోటికి వచ్చిన అర్జీదారులకు జిల్లా కలెక్టర్ స్నాక్స్, వాటర్ బాటిల్, టీ సౌకర్యాలను కల్పించారు. అర్జీ దారులు ఈ సౌకర్యాలను వినియోగించుకొని ఆనందం వ్యక్తం చేశారు.

**ప్రజల నుండి అందిన కొన్ని విజ్ఞప్తులు**

వీరబల్లి మండలానికి చెందిన ఆంజనేయులు తనకు 65 సంవత్సరాలని ఎటువంటి స్థిర చరాస్తులు లేవని తనకు వృద్ధాప్య పింఛను ఇప్పించవలసిందిగా జిల్లా కలెక్టర్కు విన్నవించుకున్నారు. రైల్వే కోడూరు మండలానికి చెందిన కళ్యాణి తమ హౌస్ హెూల్డ్ మ్యాపింగ్ లో పక్క ఇంటివారిని కూడా చేర్చారని వారిని తొలగించవలసిందిగా జిల్లా కలెక్టర్కు విన్నవించుకున్నారు. రాయచోటి మండలానికి చెందిన చంద్ర మరియు అరుణలు తమకు సొంత ఇల్లు లేదని ప్రభుత్వం నుండి ఇంతవరకు అందలేదని తమది నిరుపేద కుటుంబమని ప్రభుత్వం నుండి స్థలాన్ని కేటాయింపు చేసి ఇంటిని కట్టుకునేలా చూడగలరని జిల్లా కలెక్టర్కు విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఓ మధుసూదనరావు, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు



## కూటమి నేతల ఎన్నికల హామీలేమయ్యాయి?

**- మేయర్ మహమ్మద్ వసీం**

**అనంతపురం క్రైం – సూర్య వాస్తవం, ఆగస్టు 4:** ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని నగర మేయర్ మహమ్మద్ వసీం ప్రశ్నించారు.నగర పరిధిలోని 19వ డివిజన్‌లో మేయర్ మహమ్మద్ వసీం బాబు షూరీటి మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటా పర్యటించి క్యూ ఆర్ కోడ్ ను స్కాన్ చేయించి చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు వివరించారు.ఈ సందర్భంగా మేయర్ మహమ్మద్ వసీం మాట్లాడుతూ ఎన్నికలపుడు సూపర్ సిక్స్, సూపర్ సెవన్ అంటూ మ్యానిఫెస్టో విడుదల చేసి అధికారంలోకి వచ్చాక తొలి ఏడాది పూర్తిగా ఎగరగొట్టి రెండో యేడాది అరకొరగా అమలు చేస్తూ ప్రజలను మోసం చేశారని విమర్శించారు.బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా తాము ప్రజల వద్దకు వెళ్తుంటే వైసీపీ హయాంలోనే తమకు సంక్షేమ పథకాలు బాగా అందేవని, రెట్టింపు పథకాలు ఇస్తామని కూటమి నేతలు చెపితే ఓటువేసి మోసపోయామని ప్రజలు చెపుతున్నారన్నారు .నగరంలో సైతం గతంలో ఎన్నడూ లేని రీతిలో 19వ డివిజన్ పరిధిలో వైసీపీ హయాంలో రూ.1.20కోట్ల వ్యయం చేసి రోడ్డు, డ్రైనేజీలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కమల్ భూషణ్,వైసీపీ సీనియర్ నేతలు అనంత చంద్రారెడ్డి, ఏకేఎస్ ఫయాజ్,అనుదీప్ రెడ్డి నాయకులు షేక్ జావిద్, రామచంద్ర, షాను, కుమార్, మనోజ్, శివ, సాయి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు పెన్షన్, ఉద్యోగ భద్రత కల్పించండి

**- జర్నలిస్టుల సమస్యలను కలెక్టర్‌కు వివరించిన ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు**



**అనంతపురం కలెక్టరేట్ – సూర్య వాస్తవం, ఆగస్టు 4:** ఏపీలో వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలను పరిష్కారించాలంటూ.. ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టర్లకు వినతి పత్రాలు అందజేస్తోంది. జర్నలిస్టు డిమాండ్స్ డేను పురస్కరించుకుని.. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలో ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు రెండు జిల్లాల కలెక్టర్లను కలిసి జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల్ని, వివరించారు .అనంతపురంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు షఫీ, ప్రధాన కార్యదర్శి రేపటి రామాంజినేయులు ఆధ్వర్యంలో ఇన్ ఛార్జి కలెక్టర్ శివనారాయణ శర్మను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రేపటి రామాం జినేయులు మాట్లాడుతూ జర్నలిస్టుల ఆరోగ్యబీమా కొనసాగిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. అలాగే తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కారించాలన్నారు. జర్నలిస్టుల ఇంటిస్థలాల కేటాయింపుతో పాటు జర్నలిస్టుల ఉద్యోగ భద్రత,, ఇతర సదుపాయాలపై మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. బీహార్ తరహాలో మనరాష్ట్రంలోని జర్నలిస్టులకు 15వేల పెన్షన్ పథకాన్ని అమలు చేయడంతో పాటు సమాచార శాఖను బలోపేతం చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది పూర్తైనా ఇప్పటి వరకు అక్రిడిటేషన్లు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. 6వ తేదిన జరగబోయే క్యాబినెట్ సమావేశంలో ఈ అంశాలన్నింటినీ చర్చించి.. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు..ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు జయప్రకాష్, డాక్టర్ సూర్య, వేణుగోపాల్, విజయ్ కుమార్, సుధాకర్, బన్సీలాల్, కేశవ, దాదాపీర్ , రాజారెడ్డి, పవన్, శింగనమల ప్రసాద్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణ, సేవా భావానికి ప్రతీక స్కౌట్

**- ప్రతి పాఠశాలలో స్కౌట్ యూనిట్ తప్పనిసరి**
**- స్కౌట్ శిక్షణతో బంగారు భవిష్యత్తు,**
**- నూతన యూనిట్ లీడర్లకు ధ్రువపత్రాల అందజేత**
**- జిల్లా సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి వెల్లడి.**



**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం, ఆగస్టు 04:** విద్యార్థులలో చిన్ననాటి నుండే క్రమశిక్షణతో పాటు దేశభక్తి, సామాజిక సేవా భావాలను పెంపొందించడానికి బాల భటుల ఉద్యమం( స్కౌట్స్ అండ్ గైడ్స్) తోడ్పడుతుందని జిల్లా సెక్రెటరీ మడితాటి నరసింహారెడ్డి అన్నారు. సోమవారం ఉదయం జిల్లాలో నూతనంగా ప్రారంభించిన యూనిట్ లీడర్లకు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో స్కౌట్ యూనిట్‌ను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. బాల బాలికలకు వేరువేరుగా యూనిట్లను ఏర్పాటు చేయాలన్నారు. స్కౌట్ లో చేరడం ద్వారా విద్యార్థి దశ నుండే తల్లిదండ్రులతో, గురువులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించడానికి అవకాశం ఉంటుందన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ ట్రైనింగ్ పొందిన విద్యార్థులకు శారీరిక దారుఢ్యం ఏర్పడుతుందన్నారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడం ద్వారా ప్రపంచ స్థాయి పౌరులుగా ఎదిగేందుకు ఇది ఎంతగానో దోహదపడుతుందన్నారు. స్కౌట్ నందు శిక్షణ పొందిన విద్యార్థులకు విద్యా ఉద్యోగ అవకాశాలలో రిజర్వేషన్ సౌకర్యం కలదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర్, కబ్ మాస్టర్ గురునాథరెడ్డి, స్కౌట్ మాస్టర్లు నితిన్ రెడ్డి, రఫిక్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## యువత స్వయం కృషితో ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవాలి

**- రెటీనా పెయింట్స్ లిమిటెడ్ ప్రారంభ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి**





**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం, ఆగస్టు 04:** యువత స్వయం కృషితో ఉపాధి అవకా శాలను పెంపొం దించు కోవాలని వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి పాల్గొ న్నారు. రాయచోటి పట్టణం మదనపల్లె రోడ్డులో గాలివీడు మండలం నూలివీడు సర్పంచ్ పెద్ద ఉమాపతి రెడ్డి కుమారుడు ఉమా శంకర్ రెడ్డి చే నూతనంగా ఏర్పాటైన రెటీనా పెయింట్స్ లిమిటెడ్ ప్రారంభ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, వైఎస్ఆర్ సిపి గాలివీడు మండల కన్వీనర్ మిట్టపల్లె యదుభూషన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల నాగభూషన్ రెడ్డిలతో కలసి శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన రాయచోటిలో నూతనంగా వ్యాపా కేంద్రాలు, హోటల్స్, పలు షాపింగ్ మాల్స్ అభివృద్ధి చెందుతుండడం హర్షణీయమన్నారు. వినియోగ దారులకు నాణ్యమైన సేవలు అందించి మన్న నలును పొందాలని నూతనంగా పెయింట్స్ షాప్‌ను ఏర్పాటు చేసిన ఉమా శంక ర్‌రెడ్డికి శ్రీకాంత్‌రెడ్డి సూచిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయచోటి మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజర్ రెహమాన్, పట్టణ వైఎస్ ఆర్ సిపి కన్వీనర్ నవాజ్, గాలివీడు మండలం లోని సర్పంచులు కేశవ రెడ్డి, రామాంజులు రెడ్డి, వెంకటాద్రి, ఎంపిటిసిలు చిన్నరెడ్డి, అమానుల్లా, మాజీ ఎంపిటిసి దాసరి చిన్నరెడ్డి, నాయకులు గుమ్మా అమరనాధ రెడ్డి, వాల్మీకి సంఘ జిల్లా అధ్యక్షుడు గువ్వల బుజ్జి బాబు, భానుమూర్తి రెడ్డి, మాజీ సర్పంచ్ ప్రసాద్ రెడ్డి, ఓబులేసు, వాటర్ షెడ్ చైర్మన్‌లు రమణా రెడ్డి, పెద్దరెడ్డన్న, ఆంజనేయులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


## మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డిని కలిసిన న్యాయవాదులు




**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం, ఆగస్టు 04:** రాయచోటిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం నాడు మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డిని పలువురు న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్సార్ సిపి లీగల్ సెల్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో న్యాయవాదులు ప్రస్తుత కూటమి ప్రభుత్వం వైఎస్సార్ కాంగ్రెస్ నాయకులపై పెడుతున్న అక్రమ కేసులు, రాజకీయ కక్ష సాధింపు చర్యలపై చర్చించారు. ఇందుకు స్పందించిన శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజాస్వామ్యాన్ని కాపాడడం న్యాయవాదుల బాధ్యత అని, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలపై జరుగుతున్న దాడులను చట్టపరంగా ఎదుర్కొనాల్సిన అవసరం ఉందన్నారు. అంతేగాక చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్న ప్రభుత్వ చర్యలను నిలదీయడానికి న్యాయవాదులు ఐక్యంగా ముందుకు రావాలని సూచించారు. న్యాయవాదులు తమ పూర్తి సహకారాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, వైఎస్ఆర్ సిపి లీగల్ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు రెడ్డెప్ప రెడ్డి, నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు రమేష్ రెడ్డి, న్యాయవాదులు హిదయాతుల్లా, రాజశేఖర్ రెడ్డి,రామ్ కుమార్, వెంకటేశ్వర్లు, పవనీష్ రెడ్డి, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## నిశ్చితార్థ వేడుకల్లో సుగవాసి ప్రసాద్ బాబు

**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం, ఆగస్టు 04:** సోమవారం రోజు టి.సుండుపల్లిలో ఎంసీఆర్ కల్యాణమండపంలో రాయచోటి పట్టణం మాసాపేట వాస్తవ్యులు యడం ప్రతాప్ కుమారుడు సత్యదీప్ - తేజశ్రీ (సుంకర సుధాకర్ బాబు గారి కుమార్తె) ల వివాహ నిక్షితార్త వేడుకలో రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు రాయచోటి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సుగవాసి ప్రసాద్ బాబు హాజరై ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.





## శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో

# బీ.టెక్ ఫ్రెషర్స్‌కి ఓరియంటేషన్

**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం, ఆగస్టు 04:** అన్నమయ్య జిల్లా, రాయచోటి శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాలలో (అటానమస్ )సోమవారం మొదటి సంవత్సరం బీ.టెక్ విద్యార్థుల కోసం ఓరియంటేషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాజంపేట స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ డా. పి. శంకర్ గారు విద్యార్థులను ఉద్దేశించి విలువైన సూచనలు అందించారు. అధ్యయన కాలం మొత్తం విద్యార్థులు క్రమశిక్షణ, అంకితభావం, కమ్యూనికేషన్ స్కిల్స్, సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రాజెక్టుల రూపకల్పనలో నూతన ఆవిష్కరణల పట్ల ఆసక్తి పెంచుకోవాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియో గించుకుంటూ పరిశోధనల వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు.
కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డా. ఎం. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ "గత 24 సంవత్సరాలుగా ఈ సంస్థ సాంకేతిక విద్యలో నూతన ప్రథమాలను నెలకొల్పింది. నాక్ బి ప్లస్ గ్రేడ్, అటానమస్ హోదా కలిగిన ఈ కళాశాల, తల్లిదండ్రుల కలలను నిజం చేసేందుకు నాణ్యమైన విద్యను అందిస్తోంది. స్మార్ట్ హ్యాకతాన్ వంటి టెక్నికల్ ఈవెంట్ల ద్వారా విద్యార్థులు తమ ప్రతిభను మెరుగుపరుచుకుంటున్నారు. విద్యార్థుల కోసం








పరిశ్రమలకు అనుగుణంగా కోడింగ్, ప్రోగ్రామింగ్ శిక్షణలు ఇవ్వడమే కాక, శిక్షణ సంస్థలతో భాగస్వామ్యం ద్వారా 100శాతం ప్లేస్‌మెంట్లకు అవకాశాలను కల్పిస్తున్నాం. అకడమిక్, నాన్-అకాడమిక్ ప్రతిభ గల విద్యార్థులకు గుర్తింపుగా జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా డైరెక్టర్ హీరా రాజ్‌పుత్ మాట్లాడుతూ "సామాజిక మాధ్యమాల బానిసలుగా కాకుండా, విలువలతో కూడిన విద్యను అభ్యసించి, లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా. వి. బాలాజీ, వైస్ ప్రిన్సిపల్ డా. వి. వెంకటరమణ, సైన్స్ అండ్ హ్యూమానిటీస్ హెడ్ డా. ఎన్. నాగేంద్ర, ఇతర శాఖాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థుల విద్యారంభానికి మార్గదర్శకంగా నిలిచిన ఈ కార్యక్రమం ప్రశంసలు అందుకుంది.

# సైబర్ క్రైమ్ కేసును చేధించిన సీఐ జయ నాయక్

**- సన్మానించిన ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్. ఎస్ఎఫ్ఐ నాయకులు**



**రాయదుర్గం - సూర్య వాస్తవం, ఆగస్టు 04:** పాన్ ఇండియా సైబర్ క్రైమ్ (అంతర్జాతీయ అంతర్జాల దోపిడీ) ఛేదించి ముఠాను పట్టుకొని ఏపీ కే వన్నెతెచ్చిన అనంత సూపర్ పోలీస్ అన్నింటా ప్రశంసలు అందుకున్నారు. ఈ క్రమంలో సోమవారం పోలీస్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి పూలమాలలు వేసి ప్రత్యేక అభినందనలు తెలిపారు. కేంద్రం లో సైబర్ నేరాల కట్టడికి ప్రత్యేక బృందాలు ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కీర్తి, ప్రతిష్ఠలు నిలిపేల అనంత సివిల్ పోలీసులు ఎస్పీ జగదీష్ నేతృత్వంలో దాదాపు నెల రోజులకు పైగా స్పెషల్ టింలో రూరల్ సీఐ వెంకటరమణ రాయదుర్గం అర్బన్ సిఐ జయ నాయక్ కణేకల్లు ఎస్ఐ నియామకంతో ఆక్రైమ్ ను గట్టు రట్టు అయ్యేలా పనితీరు ప్రతిభ కనబరి చడం ప్రశంసనీయం అని నాయకులు పేర్కొన్నారు. రాయదుర్గం రూ.1.73 కోట్ల బాధితుడి పిర్యాదు అందు కొని కాంబోడియా దేశం నుండి సైబర్ వల వేసి క్రిప్టో కరెన్సీ స్వదేశ సరిహద్దు దాటే పరిధిలో యత్నాన్ని భగ్నం చేసి ఐదుగురు సైబర్ ముఠాను అరెస్ట్ చేసి రూ.41.20 లక్షల నగదు సైబర్ సామగ్రి స్వాధీనం చేసుకున్న రాయదుర్గం నియోజకవర్గం పోలీసులను విద్యార్థి యువజన సంఘాలుగా అభినందిస్తు న్నాం. ఇలాంటి కేసులు మరెన్నో కూడా చేదించి బాధింపబడ్డ ప్రజలకు పూర్తిస్థాయిలో న్యాయం చేయడానికి పోలీసు వారు అన్ని రకాలుగా కృషి చేస్తున్నారు. ఇలాంటి తరుణంలో నకిలీ యాప్ల వల్ల ఫేక్ ఫోన్ కాల్స్ కు జాగ్రత్త ప్రజలు వహించాలి ఇట్లాంటి అరుదైన కేసులను సైబర్ క్రైమ్ కేసు చేదింపు పై జిల్లా ప్రజలతో పాటు సామాజిక బాధ్యత. కలిగిన ప్రతి ఒక్కరూ హర్షించదగ్గ విషయం. వర్షం వ్యక్తం చేస్తున్న సందర్భాలు ఉన్నాయి. సామాజిక బాధ్యతతో. ఏ అవసరం వచ్చినా పోలీసు వారికి విద్యార్థి యువజన సంఘాలు ఎప్పుడూ కూడా అందుబాటులో ఉంటామని జిల్లా పోలీసు వారికి మనపూర్వకంగా తెలియజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ కుమార్, నాగయ్య, గౌతమ్ రాజు, మనోజ్, వంశి, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం



**రాప్తాడు-సూర్య వాస్తవం, ఆగస్టు 04:** ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు తెలుగుదేశం పార్టీ అధిష్టానం ప్రజల వద్దకే పాలన పేరు తో కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని టిడిపి మండల కన్వీనర్ కొండప్ప కార్యదర్శి శ్రీనివాసులు పేర్కొన్నారు. రాప్తాడు మండలంలోని బొమ్మేపర్తి గ్రామంలో ప్రజా ఫిర్యాదు పరిష్కారం వేదికను నిర్వహించారు. రేషన్ కార్డులు పింఛన్లకు భూమి సర్వేకు సంబంధించిన సమస్యలు ఎక్కువగా ఉన్నాయని గుర్తించారు. సమస్యలను అర్జీల రూపంలో ప్రజల నుండి తీసుకున్నారు. సంబంధిత ప్రభుత్వ అధికారులతో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కురుబ రాష్ట్ర అధ్యక్షులు గంగులకుంట రమణ, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గంగాలకుంట క్రిష్ణ, మరో సింగల్ విండో అధ్యక్షులు మారూరు గోపాల్, బుక్కచెర్ల సింగల్ విండో అధ్యక్షులు బ్రహ్మానందం రెడ్డి, చెరువు చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఓబులేష్ ఫీల్డ్ అసిస్టెంట్ చిన్న, ఓబులేష్, రఘునాథ్ రెడ్డి, డీలర్ ఎర్రప్ప, ఎర్రి స్వామి, క్లస్టర్ ఇన్‌చార్జి, రాము నారాయణస్వామి, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## చరవాణిలు అప్పగింత



**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం ,ఆగస్టు 04:** రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు లక్కిరెడ్డిపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని సెక్టార్ సూపర్వైజర్లకు చరవాణి లను అప్ప గించామని ఐసిడిఎస్ ప్రాజెక్టు అధ్యక్షురాలు సుకుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యాప్‌లలో పని భారం ఎక్కువ అవడం, చరవాణిలు మొరాయి స్తుండ డంతో సమాచారం నిక్షిప్తం చేయడం కష్టంగా మారిందని, అంగన్వాడీ కార్యకర్తలకు పని ఒత్తిడికి గురవుతూ మానసికంగా వత్తిడికి గురవుతూ ఆరోగ్యపరమైన ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఆయా సెక్టార్ సూపర్వైజర్లకు సెల్ ఫోన్లు అప్పగించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు కార్యదర్శి ఓబులమ్మ, గౌరవ అధ్యక్షురాలు ప్రభావతి, సెక్టార్ లీడర్లు రుక్మిణి, శిరీష, శారద,నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## బుడ్డావాండ్లపల్లెలో గడికోట శ్రీకాంత్ రెడ్డి, సుగవాసి బాల సుబ్రమణ్యంల పర్యటన





**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం, ఆగస్టు 04:** రాయచోటి మండలం యండపల్లె గ్రామం బుడ్డావాండ్లపల్లెలో మాజీ ఎంపిపి పోలు సుబ్బారెడ్డి, వైఎస్ఆర్ సిపి జిల్లా ఉపాధ్యక్షుడు పల్లపు స్థానిక నాయకులతో కలసి వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, జెడ్ పి మాజీ ఛైర్మన్ సుగవాసి బాల సుబ్రమణ్యం లు పర్యటించారు. ప్రజలు, వైసిపి కార్యకర్తలు, నాయకులతో గడికోట శ్రీకాంత్ రెడ్డి, సుగవాసి బాల సుబ్రమణ్యం లు మమేకమయ్యారు. ప్రజల కష్ట నష్టాలను అడిగి తెలుసు కున్నారు.

**వివాహ శుభాకాంక్షలు తెలిపిన శ్రీకాంత్ రెడ్డి, బాల సుబ్రమణ్యంలు**

యండపల్లె గ్రామం బుడ్డావాండ్లపల్లె కు చెందిన బుడ్డా రామిరెడ్డి కుమార్తె అపర్ణ, మహేష్ ల వివాహ రిసెప్షన్ కు శ్రీకాంత్ రెడ్డి, బాలసుబ్రమణ్యం,మాజీ ఎంపిపి పోలు సుబ్బారెడ్డి, పల్లపు రమేష్ లు హాజరై వివాహ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కసిరెడ్డి వెంకట నరసింహా రెడ్డి, వైసిపి ఐటి వింగ్ ధర్మారెడ్డి, మాజీ కౌన్సిలర్ ఆనంద రెడ్డి, నాయకులు శ్రీనివాసులు రెడ్డి, అమరనాధ రెడ్డి, రాజగోపాల్ రెడ్డి, నిమ్మనపల్లె శ్రీనివాసులు రెడ్డి, మారం. రామాంజులు రెడ్డి, యర్ర బయన్న, నల్ల బయన్న తదితరులు పాల్గొన్నారు.

### సాగునీటి ప్రాజెక్టులు,

# భూ పోరాటాలకు సిద్ధం కండి

**-మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ ఎర్రగుడి ఈశ్వర్‌రెడ్డి వర్ధంతి సదస్సులో సిపిఎం పిలుపు**



**పత్తికొండ టౌన్ – సూర్య వాస్తవం, ఆగస్టు 04 :** సాగునీటి ప్రాజెక్టుల కోసం భూ పోరాటాలకు సిద్ధం కావాలని సోమవారం పట్టణంలోని కుమ్మరి వీధిలో సిపిఎం పార్టీ కార్యాలయం ముందు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే ఎర్రగుడి ఈశ్వర్ రెడ్డి వర్ధంతి సదస్సులో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ పిలుపునిచ్చారు. ఈ సదస్సుకు పత్తికొండ సిపిఎం పార్టీ మండల కార్యదర్శి చక్రాల వెంకటేశ్వర్ రెడ్డి అధ్యక్షతన వహించగా ఈ సదస్సుకు నియోజకవర్గంలోని సిపిఎం పార్టీ సాను భూతిపరులు నాయకులు కార్యకర్తలు అత్యధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి గౌస్ దేశ మాట్లాడుతూ పత్తికొండ నియోజకవర్గాన్ని సిపిఎం పార్టీ పరిపాలించిందని 1967 నుండి 72 దాకా ఎర్రగుడి ఈశ్వర్ రెడ్డి పత్తికొండ నియోజకవర్గం పరిపాలించడంతోపాటు విద్యుత, మారుమూల గ్రామాలకు రోడ్డు సౌకర్యాలు గిరిజన గ్రామాలకు భూ పంపిణీ చేయడంతో పాటు సాగు తాగునీటి పై ఉద్యమం ఉధృతం చేసి ప్రాజెక్టులు నిర్మించడంతోపాటు రైతాంగ పక్షపాతిగా రైతులకు అండగా నిలబడి పత్తికొండ ప్రాంతంలో మరిచిపోని మహనీయునుగా నిలిచారని అన్నారు. పత్తికొండ ప్రాంతం నుండే ప్రతిపక్ష పార్టీ అధికార పక్ష పార్టీలు అధికార దుర్వినియోగం చేస్తూ వారి సొంత నియోజకవర్గం నీటిని తరలిస్తున్నారని పత్తికొండ నియోజకవర్గం హంద్రీనీవా పారుతున్న కనీసం రైతులకు వాడుకునే పరిస్థితి లేక కేవలం ఆరుగాల పంటకే రైతులు అవుతున్నారని దీన్ని పత్తికొండ నియోజకవర్గంలో ఉన్న రైతంగం గమనిం చాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ నాయకులు రామచంద్రయ్య, సిపిఎం పార్టీ జిల్లా నాయకులు ఆనంద్, వీర శేఖర్, వైయస్సార్ పార్టీ మండల నాయకులు కారం నాగరాజు, బంజారా సంఘం జిల్లా నాయకులు సోమల నాయక్, ముస్లిం మైనార్టీ నాయకులు హ్యాపీ హెూం ఇబ్రహీం, సిపిఎం మండల నాయకులు రంగారెడ్డి, దస్తగిరి, సురేంద్ర, సిఐటియు నాయకులు గోపాల్, ఎం రవిచంద్ర, తుగ్గలి మద్దికేర పార్టీ నాయకులు నియోజకవర్గ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.





## థాంక్యూ సీఎం సార్: ఎమ్మెల్యే సునీత

**రాప్తాడు – సూర్య వాస్తవం, ఆగస్టు 04 :** ఖరీఫ్ సీజన్ లో రైతులకు ఆర్థిక సాయం చేసినందుకు నియోజకవర్గంలోని మహిళా రైతులు ఎమ్మెల్యే సునీతతో కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. రామగిరి మండలం నసనకోట పంచాయతీకి చెందిన టిడిపి నాయకులు రైతులు వెంకటాపురంలోని ఎమ్మెల్యే వ్యవసాయ క్షేత్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి నవధాన్యాలతో అభిషేకం చేశారు.థాంక్యూ సీఎం సార్ అంటూ వీడియో రిలీజ్ చేశారు.ఈ సంధర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ లో రైతులకు సరైన సమయంలో అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేశారు.దీనిపై అన్ని ప్రాంతాల్లోనూ రైతుల నుంచి హర్షం వ్యక్తమవు తోందన్నారు. మొదటి విడతగా రూ.7000 అందింది అని తెలిపారు.దేవుడి దయవల్ల ఒక మంచి వర్షం కురిసినా జిల్లా వ్యాప్తంగా పంటల మంచిగా సాగు అవుతుందన్నారు. ఇప్పటికే రైతులకు డ్రిప్ స్పింకర్లు డ్రోన్లు గోకులం షెడ్లు ఇచ్చి ప్రోత్సహిస్తున్నామని అన్నారు.ఈ ప్రభుత్వం ఎప్పటికీ రైతు పక్షపాతిగా నిలుస్తుందని స్పష్టం చేశారు. మండల టిడిపి నాయకులు రైతులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మున్సిపల్ ఫిట్టర్‌పై హత్యాయత్నం



**మదనపల్లె – సూర్య వాస్తవం, ఆగస్టు 04 :** మదనపల్లె మున్సిపాలిటీ లో ఫిట్టర్ గా పనిచేస్తున్న సుధాకర్(52)పై ప్రత్యర్థులు రాళ్లు, కత్తులతో దాడి చేసి హత్యా యత్నానికి పాల్పడ్డారు. ఈ సంఘటన సోమవారం పట్టణంలో జరిగింది. బాధితుని కథనం మేరకు.. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కొన్నేళ్లుగా ఫిట్టర్‌గా పని చేస్తున్న సుధాకర్ విధి నిర్వహణలో భాగంగా మధుసూదన సినిమా థియేటర్ వద్ద ఉన్నాడు.రోడ్డుపై నిలబడి ఫోన్‌లో మాట్లాడుకుంటున్నాడు. ఈ సమయంలో గాంధీపురం కు చెందిన రాజా, ప్రదీప్, రవి మరికొంత మంది ఒక్కసారిగా సుధాకర్ పై విచక్షణ రహితంగా దాడి చేసి, రాళ్లతో కొట్టి కత్తితో పొడిచి హత్యాయ త్నానికి పాల్పడ్డారు. గమనించిన స్థానికులు రక్తపు మడుగులో ఉన్న బాధితున్ని వెంటనే జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. తన భార్యతో ఎందుకు మాట్లాడుతున్నావని ప్రశ్నించి నందుకు రాజా ఈ ఘాతకానికి పాల్పడినట్లు బాధితుడు సుధాకర్ వాపోయాడు. ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గుత్తి మున్సిపల్ ఆఫీసులో ఐసి డిఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవం

**గుత్తి –సూర్య వాస్తవం, ఆగస్టు 4:**గుత్తి మున్సిపల్ ఆఫీసులో ఐసి డిఎస్ వారి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం జరిగినది.ఈ సందర్భంగా ఐసిడి ఎస్ సూపర్ వైజర్ రాజేశ్వరి తల్లి పాల వారోత్సవాల కార్యక్రమం ద్వారా పిల్లలకు తల్లి పాలు ప్రాముఖ్యతను, కార్యక్రమ అవగాహన విషయాలు తెలియ జేశారు. మున్సిపల్ మేనేజర్ రాంబాబు ఐసిడిఎస్ విభాగపు సూపర్ వైజర్ రాజేశ్వరి, ఆర్.ఐలు నాగార్జున,ఫాయాజ్ అహ్మద్,మున్సి పల్ అధికారులు, సిబ్బంది, ఐసిడి ఎస్ సిబ్బంది పాల్గొవున్నారు.




## కరాటేలో జాతీయస్థాయిలో కదిరి విద్యార్థుల ప్రతిభ



**కదిరి– సూర్య వాస్తవం, ఆగస్టు 4:** కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో సీఎంఏ గ్రాండ్ కన్వర్టర్ ఫంక్షన్ హాల్ మునీర్ భాష నిర్వహించినటువంటి జాతీయస్థాయి ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్ పోటీల్లో కదిరి విద్యార్థులు 9 మంది ( కటాస్) విభాగంలో పాల్గొని విజయభేరి ముగించారు ఏడు మంది విద్యార్థులుబంగారు పథకాలని సాధించగా ఇద్దరు విద్యార్థులు సిల్వర్ మెడల్స్ ని సాధించారు వీరిలో మహమ్మద్ అసద్. హానిక రాయల్. భవ్య. అనస్. చైత్ర శ్రీ. మొహమ్మద్ మునాఫ్. భవిష్య. గోల్డ్ మెడల్ సాధించగా అయిషా. ఇషిత. సిల్వర్ మెడల్ సాధించారు సత్యసాయి జిల్లా కియో జపాన్ షోటో ఖాన్ ప్రెసిడెంట్ మాస్టర్ అక్బర్ అలీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచి కరాటే సాధన చేస్తే ఆరోగ్యవంతులుగా ఉంటారని వాళ్లలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని ఏదైనా సాధించగలం అనే దృఢ సంకల్పం ఏర్పడుతుందని తెలిపారు కరాటే బాక్సింగ్ లాంటి స్కూల్ గేమ్స్ నిర్వహించే ఎస్ జి ఎఫ్ పోటీల్లో పాల్గొంటే విద్యార్థులకు త్రీ పర్సెంట్ స్పోర్ట్స్ కోట సర్టిఫికెట్స్ ఉపయోగపడతాయని ప్రతి ఒక్కరూ కరాటే బాక్సింగ్ లాంటి గేమ్స్ ని నేర్చుకోవాలని తెలిపారు. కరాటే మాస్టర్ అక్బర్ అలీని తల్లిదండ్రులు అభిన ందించారు.

## బాక్సింగ్‌లో బంగారు పతకాలు సాధించిన వీఆర్ఓ జగదీష్

### - సన్మానించిన జిల్లా కలెక్టర్

### -విద్యార్థినీ విద్యార్థులు పాఠ్యాంశాలపైనే కాకుండా క్రీడల పైన కూడా దృష్టి పెట్టాలి

### - జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి





**అన్నమయ్య బ్యూరో– సూర్య వాస్తవం ,రాయ చోటి, ఆగస్టు 04:** బాక్సింగ్ విభాగంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బంగారు పథకాలు సాధించిన నందలూరు గ్రామ విఆర్ఓ జగదీష్‌ను సోమవారం మధ్యాహ్నం రాయచోటి కలెక్టరేట్‌లోని పి జి ఆర్ ఎస్ హాల్లో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాక్సింగ్ విభాగంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకాలు పొందిన ఎం.జగదీష్ క్రీడలలో ఎంతోమందికి ఆదర్శప్రా యమన్నారు. అన్నమయ్య జిల్లా యువత జగదీష్ ను ఆదర్శంగా తీసుకొని అన్ని రకాల క్రీడలలో జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగేలా కృషి చేయాలన్నారు. వీఆర్వో జగదీష్ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో పథకాలు పొందేలా శిక్షణ ఇచ్చిన ఆయన కోచ్ ఆనంద్‌ను కూడా ఈ సందర్భంగా సన్మానించి, మరింత మంది క్రీడాకారులను ఈ స్థాయికి ఎదిగేలా కృషి చేయాలని సూచించారు.




## ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలి

**- ఇన్‌ఛార్జి జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ**

**అనంతపురం వైద్యం – సూర్య వాస్తవం, ఆగస్టు 04 :** ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు – 2025ను ఘనంగా నిర్వహించాలని ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ ఆదేశించారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు – 2025 పోస్టర్లను ఇంచార్జి జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఇంచార్జి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆగస్టు 01వతేదీ నుండి 07 వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలును జిల్లాలో నిర్వహించాలన్నారు. తల్లి పాలకు మద్దతునిచ్చే స్థిరమైన వ్యవస్థలను ఏర్పాటు చేసి తల్లి పాల సంస్కృతి ప్రోత్సాహానికి ప్రాధాన్యత ఇద్దామన్నారు. తల్లి పాలు బిడ్డ హక్కు అని, తొలి టీకా, జీవితానికి కవచం – ఆరోగ్యభవితకు బలమైన పునాది అని, తల్లి పాలు ఇవ్వడం వలన బిడ్డకే కాదు, తల్లికి కూడా శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా రక్షణ లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, జిల్లా రెవెన్యూ అధికారి ఏ.మలోల, ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి జి.రామకృష్ణారెడ్డి, ఐసిడిఎస్ పీడి నాగమణి, వ్యవసాయ యూ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## లారీ ఆటో ఢీ

**- ఒకరు మృతి, ఐదుగురికి గాయాలు**





**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం, ఆగస్టు 04:** అన్నమయ్య జిల్లా, రాజంపేట మండల పరిధిలోని బోయినపల్లి సమీపంలో నేడు శనివారం లారీ ఆటో ఢీ కొన్న సంఘటనలో ఒక మహిళ మృతి చెందగా, ఐదుగురికి తీవ్ర గాయల య్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి నందలూ రులో మహా పుణ్యక్షేత్రం సౌమ్యనాథ స్వామిని దర్శించుకుని నందలూరు నుండి రాజంపేట కు వస్తున్న ఆటోను తిరుపతి నుంచి కడప వైపు వెళుతున్న లారీ ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదం లో రాంనగర్ కు చెందిన నాగారం నాగలక్ష్మి అక్కడే మృతి చెందగా, రామ్ నగర్ కు చెందిన నాగారం దివ్య, ఓబులవారిపల్లి కి చెందిన తోట గగన్, మౌనిక, వెంకటరమణ, శేషమాంబాపురం చెందిన సాంబయ్య మొత్తం అయిదు మంది కి తీవ్ర గాయాలయ్యాయి. రాజంపేట నుండి ఆఫీస్ కు వెళ్తున్న ఏఎస్పి. మనోజ్ రామ్నాథ్ హెగ్డే దారిలో జరిగిన ప్రమాద సంఘటన గమనించి వెంటనే గాయపడ్డ వారిని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు. రాజంపేట మన్నూరు సీఐ కుళాయిప్ప మృతి చెందిన నాగలక్ష్మికి పోస్టుమార్టం అయినా అనంతరం కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

## విద్యుత్ షాక్‌తో వెస్ట్ బెంగాల్ యువకుడు మృతి



**మదనపల్లె –సూర్య వాస్తవం, ఆగస్టు 04:** విద్యుత్ షాక్‌తో తీవ్రంగా గాయపడి తిరుపతిలో చికిత్స పొందుతున్న బెంగాల్ యువకుడు సోమవారం మృతి చెందాడు. నిమ్మనపల్లె పోలీసుల కథనం మేరకు.. వెస్ట్ బెంగాల్‌కు చెందిన సునేరా మెహరాన ్(25), మరో యువకుడు కలిసి బుధవారం నిమ్మనపల్లి మండలం రెడ్డివారిపల్లె నుంచి బాలేవాండ్లపల్లె వరకు విద్యుత్ ఫోలుపై విద్యుత్ తీగలు లాగుతుండగా ఒక్కసారిగా కరెంటు సరఫరా రావడంతో సునేరా మెహరాన్ కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే తోటి పనివాడు అతన్ని 108 లో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు చికిత్స అందించి పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## నూతన కమిటీ ఎంపిక



**హిందూపురం –సూర్య వాస్తవం ,ఆగస్టు 4 :** పట్టణంలోని రహమత్పూర్ పురంలో ఉన్న మసీదె అబ్రార్ నూతన కార్యవర్గాన్ని ఎన్ను కున్నట్లు మసీదు ముత్వల్లి అబ్దుల్ రెహమాన్ సోమవారం తెలిపారు. కార్యవ ర్గంపై ఆయన వివరిస్తూ గతంలో ఉన్న కార్యవర్గానికి గడువు ముగియడంతో సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేసుకుని నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ముత్వల్లిగా తనతో పాటు సాని ముత్వల్లి గా అస్లాం సెక్రటరీగా అజ్మతుల్లా ట్రెజరర్ గా ఆజాద్ బాషా తో పాటు మరో 9 మంది ఈసీ మెంబర్లను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎంపికైన కార్యవర్గం మూడు సంవత్సరాలు కాల వ్యవధి ఉందన్నారు. మసీదు అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు.

## బాధితులకు సత్వర న్యాయం అందించండి

**- పోలీసు అధికారులను ఆదేశించిన జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు**





**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం, ఆగస్టు 04:** ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను నిర్ణీత గడువులోపు సత్వరం పరిష్కరించాలని జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు ఐపీఎస్, పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి ఎస్పీ అర్జీలు స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను ముఖాముఖిగా అడిగి తెలుసు కున్నారు. వృద్ధులు, దివ్యాంగులు, మహిళలకు సంబంధించిన ఫిర్యాదులపై సత్వరం స్పందించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రానికి రాలేని వారు జిల్లాలోని పోలీసు స్టేషన్లు, సర్కిల్, సబ్ డివిజన్ కార్యాలయాలలో అర్జీలు సమర్పించవచ్చున్నారు. అనంతరం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల సమస్యలు తెలుసుకుని సత్వరం న్యాయం చేస్తామన్నారు.నడవలేని స్థితిలో ఎస్పీ కార్యాల యానికి వృద్ధురాలు, ఆమె దగ్గరకే వెళ్ళి సమస్యను తెలుసుకున్న ఎస్పీ సమస్యను పరిష్కరించాలని ఆదేశం. లక్కిరెడ్డిపల్లి మండలం, అనంతపురం వడ్డెపల్లి గ్రామం నుండి బత్తల సుబ్బమ్మ అనే వృద్ధురాలు తన సమస్యను చెప్పుకునేందుకు ఎస్పీ కార్యాల యానికి వచ్చారు. ఎస్పీ ఆమె వద్దకే వెళ్లి సమస్య విన్నారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్పీ చట్ట పరిధిలో వృద్ధురాలి సమస్యను పరిష్కరించాలని లక్కిరెడ్డిపల్లి ఎస్ఐ ని ఆదేశించారు

## క్షేత్ర పర్యటనలు.. ప్రత్యక్ష నిదర్శనాలు".



**పత్తికొండ టౌన్ -సూర్య వాస్తవం , ఆగస్టు 4 :** పత్తికొండ మండల పరిధి లో గల పులికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌జిటి టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం మారుతి " ప్రాథమిక స్థాయి " లో విద్యార్థులకు "ఎన్విరాన్మెంటల్ సైన్స్" అం శాలను "క్షేత్రపర్యటన"ల ద్వారా బోధించడం ద్వారా వారికి ప్రత్యక్ష అనుభవాలు కలిగి శాశ్వతంగా గుర్తు ఉంటాయి అని తెలియచేసారు. ఈ సందర్భంగా విద్యార్థులు మొక్కల భాగాల గురించి ప్రత్యక్ష స్పర్శ ద్వారా తెలుసుకుని పరిశీ లించారు. అనంతరం విద్యార్థులకు "మొక్కలగురించి " " మొక్కలు మా ప్రాణం స్నేహితులు ", మొక్కలు సమస్త మానవాలికి ప్రాణవాయవులు " వంటి నినాదాలు పలికించారు. ప్రతి విద్యార్థి ఒక మొక్క నాటాలని మొక్క మన జీవనశైలికి నిదర్శనమని వారు విద్యార్థులకు బోధించారు.

## జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

**- రెవెన్యూ అధికారికి వినతిని ఇస్తున్న జర్నలిస్టులు**


**హిందూపురం -సూర్య వాస్తవం, ఆగస్టు 4 :** జర్నలిస్టుల సమస్యలను పరిష్క రించాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ హిందూపురం నియోజక వర్గ నాయకులు షబ్బీర్, గంగప్పలు డిమాండ్ చేశారు. వర్కింగ్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలలో డిమాండ్స్ డే కార్యక్రమం నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు జర్నలిస్టులు రెవిన్యూ కార్యలయం ముందు నిరసన తెలిపి, రెవిన్యూ అధికారికి వి నతిని ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు సుదీర్ఘకారంగా పెండింగ్లో ఉన్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు, పెన్షన్ చెల్లింపు, అక్రిడిటేష న్ల జారీకి వీలుగా కొత్త జీఓ తీసుకురావడం, మీడియాలోని ప్రస్తుత పరిస్థితిని అధ్యయనం చేసేందుకు వీలుగా మీడియా కమిషన్ ఏర్పాటు, జర్నలిస్టుల అ వార్డులను ప్రదానం చేయడం, రాష్ట్ర కేంద్రంలో వద్ద జర్నలిస్టుల కోసం ఓల్డ్ ఏజ్ హౌం నిర్మాణం తదితర అంశాలపై ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీ సుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాజేష్, అంజప్ప, నాగరాజు, శివ తదితరులు పాల్గోన్నారు.



# ప్రాణం తీసిన విహారయాత్ర

**- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి, ఒకరికి గాయాలు... - స్నేహితుల దినోత్సవం రోజే స్నేహితుడితో కలిసి పరలోకానికి వెళ్ళావా అంటూ రోదిస్తున్న తల్లిదండ్రులు**

**పెళ్లకూరు- సూర్యా వాస్తవం, ఆగస్టు 04:** స్నేహితుల దినోత్సవం రోజే విహారయాత్రకు సరదాగా వెళుతూ ఇద్దరు స్నేహితులు ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు.ఈ ప్రమాదం దొరవారిసత్రం మండలం అక్కరపాక గ్రామ సమీపాన ఉన్న జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. వివరాలనరకు నాయుడుపేట మండలం పూదూరు గ్రామానికి చెందిన భానుప్రసాద ్(20), గణేష్(19),అనిల్ (18) ముగ్గురు యువకులు స్నేహితుల దినోత్సవం సందర్భంగా విహారయాత్ర కొరకు తడ మండలం వద్ద ఉన్న వాటర్ ఫాల్స్ కి బైక్ లో పోతూ ఉండగా దొరవారిసత్రం మండలం అక్కర పాక గ్రామ సమీపానికి వచ్చేసరికి బైక్ అదుపుతప్పి ముందు వెళుతున్న కంటైనర్ లారీని వెనక భాగంలో ఢీకొన్నారు. దీంతో భాను ప్రసాద్, గణేష్ అనే యువకులు ఇద్దరు అక్కడకక్కడే మృతి చెందగా అనిల్ అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి ఈ ప్రమాదం తెలుసుకున్న ఎస్సై అజయ్ కుమార్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం



జరిగిన తీరును పరిశీలించారు గాయపడిన అనిల్ ను



స్వర్ణ టోల్గేట్ అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం సూళూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతదేహం వద్ద యువకుల తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా ఏడుస్తూ స్నేహితులగా మెలిగారు స్నేహితుడు గానే కానరానీ లోకానికి వెళ్లారా అంటూ ఏడవ సాగారు ఈ కేసును ఎస్సై అజయ్ కుమార్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టుగా తెలిపారు.

# విశాఖకు మరో ఐదు ఐటీ కంపెనీలు

**విశాఖపట్టణం- సూర్యా వాస్తవం:**

ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు మరో ఐదు ఐటీ కంపెనీలు ముందుకు వచ్చాయి. ఈ నేపథ్యంలో విశాఖ పట్నంలో ప్రభుత్వం వీటికి భూములు కేటా యించింది. ఐదు కంపెనీలు కలిపి రూ.19 వేలకు పైచిలుకు పెట్టుబడులు పెట్టనున్నాయి. ఈ పెట్టుబడుల ద్వారా సుమారుగా 50 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవ కాశాలు దక్కుతాయని అధికారులు చెప్తున్నారు. ఐదు ఐటీ సంస్థలు కూడా విశాఖ కేంద్రంగా పెట్టుబడులు పెడు తున్నాయి. మరోవైపు ఇప్పటికే టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి సంస్థలు విశాఖలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మరో ఐదు ఐటీ కంపెనీలు రానున్నాయి. ఇప్పటికే టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. ఏపీ ఆర్థిక రాజధాని విశాఖపట్నంలో టీసీఎస్, కాగ్నిజెంట్ క్యాంపస్‌లు ఏర్పాటు చేయనున్నాయి. తాజాగా మరో ఐదు ఐటీ కంపెనీలు ఏపీలో పెట్టుబడులు పెట్టనున్నాయి. ఈ ఐదు కంపెనీలు కూడా విశాఖపట్నంలోనే పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపించగా.. తాజాగా వీటికి ఏపీ ప్రభుత్వం భూములు కేటాయించింది. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్స్ ప్రమోషన్స్ బోర్డు లో తీసుకున్న నిర్ణయం మేరకు ఐదు ఐటీ కంపెనీలకు భూములు కేటాయిస్తూ



ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖపట్నంలో ఈ ఐదు కంపెనీలు కలిపి రూ.19,223 కోట్లు పెట్టుబడులు పెట్టనుండగా.. సుమారుగా 50 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కలగనున్నట్లు అధికారులు చెప్తున్నారు.సిఫీ ఇన్ఫినిటీ స్పేషెస్ లిమిటెడ్ అనే సంస్థ విశాఖపట్నంలో డేటా సెంటర్ ఏర్పాటు చేయనుంది. రూ.15,226 కోట్లతో ఈ డేటా సెంటర్ ఏర్పాటు చేయనుంది. ఈ నేపథ్యంలో పరదేశీపాలెంలో సిఫీ సంస్థకు ఎకరా 50 లక్షల రూపాయల చొప్పున 25 ఎకరాలు కేటాయించారు. అలాగే మధురవాడ ఐటీ సెజ్‌లో ఎకరా కోటి రూపాయల చొప్పున 3.6 ఎకరాలు కేటాయించారు. ఈ పెట్టుబడుల ద్వారా 600 మందికి ఉపాధి దక్కనుంది. ఇక సత్వ డెవలపర్స్ అనే సంస్థ విశాఖలో రూ.1500 కోట్లు పెట్టుబడులు పెట్టనుంది. ఈ నేపథ్యంలో మధురవాడలో ఎకరా కోటిన్నర చొప్పున 30 ఎకరాలు కేటాయించారు. సత్వ పెట్టుబడులతో సుమారుగా 25 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ వేయి కోట్లు పెట్టుబడి పెట్టనుంది. ఈ నేపథ్యంలో విశాఖపట్నం ఐటీ సెజ్‌లో ఎకరా 99 పైసల చొప్పున 10.29 ఎకరాల భూమిని కేటాయించారు. ఈ పెట్టుబడులతో పదివేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.పేనమ్ పీపుల్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థకు మధురవాడలోని హిల్-2లో 45 సెంట్లు, రుషికొండ ఐటీ పార్క్‌లో 4 ఎకరాలు మొత్తంగా ఎకరా రూ.4.05 కోట్లతో 4.45 ఎకరాలు కేటాయించారు.పేనమ్ పీపుల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.207.5 కోట్ల పెట్టుబడి పెడుతోంది. దీనిద్వారా 2,500 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. ఇక బీవీఎం ఎనర్జీ అండ్ రెసిడెన్సీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు ఎండాడ వద్ద ఎకరా రూ.1.5 కోట్ల ధరతో 10 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. బీవీఎం ఎనర్జీ సంస్థ రూ.1,250 కోట్ల పెట్టుబడితో 15000 మందికి ఉపాధి అవకాశాలు కల్పించనుంది.



## తోటి ఉద్యోగి కుటుంబానికి అండగా కాంట్రాక్ట్ ఆరోగ్య సిబ్బంది

**- సహచరురాలి మరణం తరువాత కుటుంబానికి రూ.1.29 లక్షల ఆర్థిక సాయం అందజేత**

**పెళ్లకూరు- సూర్యా వాస్తవం, ఆగస్టు 04:** రాష్ట్రంలోని వైద్య ఆరోగ్య శాఖలో 2001-2002లో కాంట్రాక్ట్ విధానంలో నియమించబడిన ఫార్మసీ ఆఫీసర్లు, ల్యాబ్ టెక్నీషియన్ ఉద్యోగులు గత 23 సంవత్సరాలుగా తమ సేవలను రెగ్యులర్ చేయాలనే న్యాయమైన డిమాండ్‌తో పోరాడుతూ వచ్చారు. గత ప్రభుత్వ హయాంలో అర్హులైన కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడం జరిగినా, కొన్ని టెక్నికల్ కారణాలు, ఎన్నికల కోడ్ కారణంగా నెల్లూరు జిల్లా నిడుగుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఫార్మసీ ఆఫీసర్ సి.హెచ్. అనురాధ ఈ అవకా శాన్ని పొందలేకపోయారు. తరువాత ఆమె ఆరోగ్య సమస్యలతో మృతిచెందారు. ఈ ఘటన తోటి ఉద్యోగుల మనసును కలిచివేసింది. అనురాధ కుటుంబాన్ని ఆదుకోవాలనే లక్ష్యంతో ఏపీ స్టేట్ కాంట్రాక్ట్ ఫార్మసీ ఆఫీసర్లు - ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మొత్తం రూ.1,29,800 (ఒక లక్ష ఇరవై తొమ్మిది వేల ఎనిమిది వందలు) సేకరించి ఆర్థిక సాయంగా అందజేశారు.ఈ మొత్తాన్ని నెల్లూరు జిల్లా గౌరవ వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. సుజాత బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎన్జీజివో రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేశ్వరులు, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె. రత్నాకర్ బాబు, అసోసియేట్ ప్రెసిడెంట్ పీ. సూర్య ప్రగతి, ఉపాధ్యక్షుడు సురేష్, నెల్లూరు జిల్లా కార్యదర్శి ప్రదీప్, శ్రీలత, వనమ్మా తదితరులు పాల్గొన్నారు.

## తాగుబోతు వీఆర్వోల సస్పెన్షన్

**- శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ సంచలన నిర్ణయం**

**పుట్టపర్తి - సూర్య వాస్తవం, ఆగస్టు 04:** ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్దంగా ప్రవర్తించిన ఇద్దరు వీఆర్వోలను శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ టి.ఎస్. చేతన్ సీరియస్ గా పరిగణించారు. ఫుల్లుగా మందుకొట్టి పబ్లిక్ లో న్యూసెన్స్ సృష్టించిన కేసులో వారిద్దరినీ సోమవారం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. శ్రీ సత్యసాయి జిల్లా రోళ్ల మండలానికి చెందిన రత్నగిరి గ్రామ వీఆర్వో టి. నాగ రాజు, గుడ్డుగురికి గ్రామ వీఆర్వో రంగనాథ్ ప్రభుత్వ ఉద్యోగుల నైతిక బాధ్యతలకు విరుద్ధంగా .. మద్యం మత్తులో రోడ్డుపై వెళ్తున్న స్థానికులతో గొడవ చేయడం ,అసభ్యంగా ప్రవర్తించినట్లు రోళ్ల తహశీల్దార్ షెక్షవలి ఇచ్చిన నివేదిక ఆధారంగా ఆ ఇద్దరినీ సస్పెండ్ చేయడం సంచలనం సృష్టించింది. ప్రభుత్వ విధానాలకు విరుద్ధంగా ప్రవర్తించే ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా, ఎంతటి వారైనా సహించ బోమని, నియమావళి ఉల్లంఘనకు తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు. కలెక్టర్ టీ.ఎస్. చేతన్ ను జిల్లా ప్రజలు ప్రశంసిస్తున్నారు.

## టీటీడీకి ఎలక్ట్రిక్ స్కూటర్ విరాళం



**తిరుమల- సూర్య వాస్తవం, ఆగస్టు 04:** విజయవాడకు చెందిన క్వాంటం ఎనర్జీ లిమిటెడ్ ఎండిలు శ్రీనివాస్, చక్రవర్తి సోమవారం రూ.1.05 లక్షల విలువైన ఒక బిజినెస్ ఎక్స్ పీ ఎలక్ట్రిక్ స్కూటర్ టిటిడికి విరాళంగా అందించారు. ఈ మేరకు శ్రీవారి ఆలయం ఎదుట స్కూటర్ పూజలు నిర్వహించి టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి స్కూటర్ తాళాలు అందించారు.ఈ కార్యక్రమంలో బోర్డు సభ్యులుభాను ప్రకాష్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## ఆ మూడు రిలీజ్లకు అదే మాట!

### - తెలుగు ప్రేక్షకుల నోట ఇప్పుడు మహావతార్ మాటే వినిపిస్తుంది. సనాతన ధర్మం పరిరక్షణ కొరకై అంటూ జనాలంతా మాట్లాడుకుంటున్నారు

ఇటీవలే పాన్ ఇండియాలో రిలీజ్ అయిన ,మహావతార్ నరసింహ, మంచి విజయం సాధించిన సంగతి తెలిసిందే. తెలుగు ప్రేక్షకులు ఈ చిత్రానికి బ్రహ్మరథం పడుతున్నారు. రిలీజ్ అయి పది రోజులు గడిచినా ఇప్పటికీ థియేటర్లు హౌస్ ఫుల్ అవుతున్నాయి. ఇప్పటికే చిత్రం వంద కోట్ల క్లబ్ లో కూడా చేరిపోయింది. మహాభారతం, భాగవతం కాన్సెప్ట్ ఆధారంగా యానిమేషన్ పాత్రలతో ప్రేక్షకులకు కనెక్ట్ చేయడంలో మేకర్స్ వంద శాతం సక్సెస్ అయ్యారు. సాధారణంగా ఇలాంటి కాన్సెప్ట్ ని యానిమేషన్‌గా రూపొందించి రిలీజ్ చేయడం అన్నది పెద్ద సాహసమే. బోర్ కొట్టని కంటెంట్ ఎందుకంటే ఇలాంటి చిత్రాలకు ఆదరణ తక్కువగా ఉంటంది. చిన్న పిల్లలే ఇలాంటి చిత్రాలకు కనెక్ట్ అవుతారు ? అన్న మాటను మహావతార్ నరసింహ బ్రేక్ చేసింది. కంటెంట్ ఉంటే ? కటౌట్ తో పనిలేదు అన్నట్లు అన్ని వర్గాల ప్రేక్షకులకు ఈ చిత్రం కనెక్ట్ అయింది. హిందు ధర్మం కాన్సెప్ట్ ను ఎంతో తెలివిగా కనెక్ట్ చేసారు. తీసుకున్న పాత్రల్లో గొప్ప ఎమోఎషన్ పండించడంతోనే ఇది సాధ్యమైంది. రెండు న్నర గంటల పాటు ఎలాంటి బోర్ ఫీల్ అవ్వకుండా కథాంశాన్ని ఎంతో ఎంగేజింగ్ గా చెప్పారు. ఆ సినిమాపైనా అదే అంచనా తెలుగు ప్రేక్షకుల నోట ఇప్పుడు మహావతార్ మాటే వినిపిస్తుంది. సనాతన ధర్మం పరిరక్షణ కొరకై అంటూ జనాలంతా మాట్లాడుకుంటున్నారు. మరి ఇదే మాట అప్ కమింగ్ రిలీజ్ విషయంలోనూ బలంగా విని పించే అవకాశం ఉంది. ఇంతకీ ఏంటా సినిమాలంటే? వివరాల్లోకి వెళ్లాల్సిందే. నటసింహ బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను, అఖండకు సీక్వెల్గా ,అఖండ 2,తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ సినిమా కూడా హిందు ధర్మం శివుడి కాన్సెప్ట్ ఆధారంగా తెరకెక్కిస్తున్నారు. శివుడి పాత్ర స్ఫూర్తితోనే బోయపాటి బాలయ్య పాత్రను తనదైన ట్రీట్ మెంట్ తో తీర్చి దిద్దుతున్నాడు.

## 'ఆ 2 పనులు చేయండి మేకర్స్'..
## పవన్ ఫ్యాన్స్ పోస్టులు!

### -టాలీవుడ్ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ లీడ్ రోల్ లో నటిస్తున్న ఓజీ మూవీపై ఆడియన్స్, ఫ్యాన్స్ లో ఎలాంటి అంచనాలు ఉన్నాయో అందరికీ తెలిసిందే

టాలీవుడ్ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ లీడ్ రోల్ లో నటిస్తున్న ఓజీ మూవీపై ఆడియన్స్, ఫ్యాన్స్ లో ఎలాంటి అంచనాలు ఉన్నాయో అందరికీ తెలిసిందే. సుజీత్ దర్శకత్వం వహిస్తున్న ఆ సినిమాపై అనౌన్స్మెంట్ నుంచే భారీ హైప్స్ ఉన్నాయి. అప్పట్లో వరుస అప్డేట్స్ తో వాటిని పెంచిన మేకర్స్.. ఇప్పుడు మళ్లీ ఫైర్ స్మార్ట్ తో ఒక్కసారిగా సంచలనం సృష్టించారు. ఓ రేంజ్ లో రెస్పాన్స్ అందుకుంటున్న ఫస్ట్ సింగిల్.. సినిమాపై ఉన్న అంచనాలను ఆకాశాన్ని తాకేలా చేసింది. 24 గంటల్లో అత్యధికంగా లైక్స్ పొందిన తెలుగు పాటగా రికార్డులను బద్దలు కొట్టింది. దీంతో పవర్ స్టార్ ఫ్యాన్స్.. ఫుల్ హ్యాపీగా ఫీలవుతున్నారు. అదే సమయంలో మేకర్స్ కు రెండు పనులు చేయమని రిక్వెస్ట్ చేస్తున్నారు అభిమానులు. ఓజీ టీ షర్ట్స్, కీ చైన్స్, కాప్స్ సహా పలు వస్తువులను అధికారికంగా రిలీజ్ చేయాలని కోరుతున్నారు. ఇప్పటికే పలు సినిమాల విషయంలో అలా జరిగిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఓజీ మేకర్స్ అది ఫాలో అవ్వాలని సూచిస్తున్నారు. అయితే అలా చేయడం వల్ల అటు అభిమానులు సాటిస్ఫై అవుతారు. ఇటు బజ్ కూడా ఇంకా పెరగనుంది. భావోద్వేగపరంగా, వాణిజ్యపరంగా అర్థవంతమైన చర్య అని చెప్పాలి. మరోవైపు, ఫైర్ స్టార్మ్ సాంగ్ ను ప్రమోట్ చేయడానికి మేకర్స్ కొందరు సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్స్ తో టై అప్ అయినట్లు తెలుస్తోంది. కానీ ఆ విషయంలో ఫ్యాన్స్ మాత్రం నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ఇన్ఫ్లుయెన్సర్ మార్కెటింగ్ ను ఇప్పుడు వ్యతిరేకిస్తున్నారు.అందులో కొందరు ఎవరికీ తెలియదని.. మరికొందరు ఇప్పటికే ట్రోలింగ్ ఎదుర్కొన్నారని అంటున్నారు.

అలాంటి వాళ్లతో ప్రమోషన్స్ కరెక్ట్ కాదని అభిప్రాయపడుతున్నారు. సినిమా గొప్పతనానికి సరిపోయేలా ఉండాలని కోరుకుంటున్నట్లు చెబుతున్నారు. దీంతో ఆ రెండు రిక్వెస్టుల విషయంలో మేకర్స్ ఏం చేస్తారో వేచి చూడాలి. ఇక సినిమా విషయానికొస్తే.. ప్రియాంక అరుల్ మోహన్ హీరోయిన్ గా నటిస్తున్నారు. బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ కీలక పాత్ర పోషిస్తున్నారు. అర్జున్ దాస్, శ్రీయా రెడ్డి ఇతరులు ముఖ్య పాత్రల్లో యాక్ట్ చేస్తున్నారు. డీవీవీ దానయ్య ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై డీవీవీ దానయ్య, కళ్యాణ్ దాసరి నిర్మిస్తున్నారు. ఎస్ ఎస్ తమన్ మ్యూజిక్ అందిస్తున్నారు. సెప్టెంబర్ 25న సినిమా రిలీజ్ కానుంది.





## వహ్వా సిరాజ్...
## ఇంగ్లండ్ పై టీమ్ఇండియా సంచలనం..

### - 2-2తో సిరీస్ సమం నాలుగో టెస్టును టీమ్ఇండియా వీరోచితంగా ఆడి డ్రా చేసింది ఆఖరిదైన ఐదో టెస్టును భారత్ అద్భుత రీతిలో సోమవారం తమ వశం చేసుకుంది




అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీకి అదిరిపోయే ముగింపు... కుర్ర కెప్టెన్ శుబ్ మన్ గిల్ కు తొలి సిరీస్ లోనే సూపర్ ఫలితం.. అతడి సారథ్యంలోని టీమ్ ఇండియా... ఇంగ్లండ్ ను దాని సొంతగడ్డపైనే నిలువరించింది... ఐదు టెస్టుల సిరీస్ ను 2-2తో సమం చేసింది. ఈ సిరీస్ లో తొలి టెస్టులో ఇంగ్లండ్ గెలుపొందగా, రెండో మ్యాచ్ లో భారత్ నెగ్గింది. మూడో టెస్టులో ఇంగ్లండ్ దే పైచేయి అయింది. నాలుగో టెస్టును టీమ్ ఇండియా వీరోచితంగా ఆడి డ్రా చేసింది. ఆఖరిదైన ఐదో టెస్టును భారత్ అద్భుత రీతిలో సోమవారం తమ వశం చేసుకుంది. కేవలం 35 పరుగులే.. అయినా బెదరలే.. టార్గెట్ 374కు గాను 339/6.. అంటే చేయాల్సింది ఇంకా 35 పరుగులే. సోమవారం ఇంగ్లండ్ పరిస్థితి ఇది. కానీ, హైదరాబాదీ పేసర్ మొహమ్మద్ సిరాజ్ అద్భుతం చేశాడు. నిప్పులు చెరిగే బంతులతో ప్రత్యర్థిని కుప్పకూల్చాడు.

సిరాజ్ (5/104) దెబ్బకు ఇంగ్లండ్ 6 పరుగుల తేడాతో ఓడిపోయింది. 367 పరుగులకే ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్ లోనూ అద్భుతం (4/86)గా బంతులేసిన సిరాజ్ కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ దక్కింది. వాస్తవానికి సోమవారం మ్యాచ్ ప్రసిద్ధ్ క్రిష్ణ బౌలింగ్ లో రెండు బౌండరీలతో మొదలైంది. ఈ నేపథ్యంలోనే టీమ్ఇండియా గెలుపు కష్టమే అనిపించింది. కానీ, సిరాజ్ జేమీ స్మిత్ (2), జేమీ ఒవర్టన్ (9), అట్కిన్సన్ (17)లను ఔట్ చేసి జట్టుకు అద్భుత విజయం కట్టబెట్టాడు. అంతకుముందు జోష్ టంగ్ (0)ను ప్రసిద్ధ్ బౌల్డ్ చేశాడు. కాగా, ఈ మ్యాచ్ ఇన్నింగ్స్‌లో టీమ్ఇండియా 224, ఇంగ్లండ్ 247 పరుగుల చేశాయి. రెండో ఇన్నింగ్స్‌లో టీమ్ఇండియా 396 పరుగులు చేయగా.. ఇంగ్లండ్ 367కు ఆలౌటైంది. ప్రపంచకప్ లో కోహ్లి.. టీమ్ ఇండియా స్టార్ చుట్టూ తీవ్రస్థాయి చర్చ తేడా సిరాజ్... ఐదు టెస్టులు ఐదో రోజు వరకు సాగిన ఈ సిరీస్ లో రెండు జట్ల మధ్య తేడా హైదరాబాదీ సిరాజ్ అనడంలో సందేహం లేదు. ఐదో టెస్టు ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ లో ఓపెనర్లు చెలరేగి ఆడుతున్నా చెక్కుచెదరని ఆత్మవిశ్వాసంతో బంతులేశాడు. రెండో ఇన్నింగ్స్ లోనూ అంతే అద్భుతంగా బౌలింగ్ చేశాడు. చివరకు టీమ్ఇండియాను గెలిపించాడు. ఐదు టెస్టులు ఆడిన సిరాజ్ అందరి కంటే అత్యధికంగా 23 వికెట్లు తీశాడు. భారత్ తరపున... 754 పరుగులు చేసిన టీమ్ఇండియా కెప్టెన్ శుబ్ మన్ గిల్ కు ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ అవార్డు దక్కింది.

## భారత్ కు ఫుట్ బాల్ ప్రపంచ చాంపియన్..

### - ప్రఖ్యాత స్టేడియం బ్లాక్ అలాంటిది ఏకంగా ఫుట్ బాల్ చరిత్రలో దిగ్గజంగా పేరుండి, కెప్టెన్‌గా ప్రపంచ కప్ కూడా అందించిన ఆటగాడు నేరుగా మన దేశానికి వస్తుండడం విశేషమే



ప్రపంచ ప్రఖ్యాత ఫుట్ బాల్ ప్లేయర్, ప్రపంచ చాంపియన్ భారత్ కు వస్తున్నాడు... సాధారణంగా అంతర్జాతీయ స్థాయిలో కనీసం పేరున్న ప్లేయర్లు కూడా మన దేశంలో పర్యటించరు.. కారణం.. భారత్ లో ఫుట్ బాల్ కల్చర్ కానీ, ఫుట్ బాల్ కు ఆదరణ కానీ పెద్దగా లేకపోవడమే..! అలాంటిది ఏకంగా ఫుట్ బాల్ చరిత్రలో దిగ్గజంగా పేరుండి, కెప్టెన్ గా ప్రపంచ కప్ కూడా అందించిన ఆటగాడు నేరుగా మన దేశానికి వస్తుండడం విశేషమే. అంతేకాదు, అతడు భారత క్రికెటర్లతో కలిసి మ్యాచ్ ఆడతాడని చెబుతున్నారు. మూడేళ్ల కిందట ఖతర్ లో జరిగిన ఫుట్ బాల్ ప్రపంచ కప్ లో తమ దేశం అర్జెంటీనాను చాంపియన్ గా నిలిపాడు లియోనల్ మెస్సీ. దీంతో ప్రపంచ ఫుట్ బాల్ దిగ్గజంగా మారాడు. అలాంటి మెస్సీ.. వచ్చే ఏడాది జరిగే ప్రపంచ కప్ ఆడతాడని కూడా భావిస్తున్నారు. కాగా దీనికిముందు మెస్సీ భారత్ టూర్ చేయనున్నాడు. మెస్సీ షెడ్యూల్ కూడా ఖరారైందని చెబుతున్నారు. మెస్సీ.. భారత మాజీ, ప్రస్తుత స్టార్ క్రికెటర్లతో కలిసి మ్యాచ్ ఆడతాడని, అందుకోసం ముంబైలోని ప్రఖ్యాత వాంఖడే స్టేడియాన్ని బ్లాక్ చేయనున్నారని తెలుస్తోంది. డిసెంబరు 13 నుంచి మూడు రోజులు మెస్సీ భారత్ లో పర్యటిస్తాడు. ముంబైతో పాటు ఫుట్ బాల్ కు బాగా ఆదరణ ఉండే కోల్ కతాలో అభిమానులను కలుస్తాడు. మెస్సీది ప్రమోషనల్ టూర్. కాబట్టి మెస్సీ రాక ఖాయమే అనుకోవాలి.

మెస్సీ 2011లోనూ భారత్ కు వచ్చాడు. అప్పుడు కోల్ కతాలోనే టూర్ చేశాడు. ఈసారి కూడా ముందుగా కోల్ కతాకే వెళ్లి.. తర్వాత రోజు ముంబైకి చేరుకుంటాడు." ఇక మెస్సీ.. క్రికెట్ ఆడబోయేది ఎవరితోనో తెలుసా? సచిన్, ధోనీ, కోహ్లి వంటి దిగ్గజాలతో. వీరి మ్యాచ్ నిర్వహణకు ఆర్గనైజర్లు ప్రణాళిక సిద్ధం చేశాడు. కోల్ కతాలోని చిన్నారుల కోసం ఫుట్ బాల్ వర్క్ షాప్ ను మెస్సీ ఏర్పాటు చేయనున్నాడు. ఈడెన్ గార్డెన్స్ లో మెస్సీ గౌరవార్థం గోట్ (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్) మ్యాచ్ నిర్వహిస్తారు. వాస్తవానికి అర్జెంటీనా ఫుట్‌బాల్ జట్టు ఈ ఏడాది అక్టోబరు, నవంబరులో కేరళ వస్తుందని రెండు నెలల కిందట ప్రకటన వచ్చింది. ఇప్పుడు ఆ జట్టు కెప్టెనే వస్తుండడంతో అర్జెంటీనా జట్టు టూర్ కష్టమే అని చెబుతున్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )